www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 205 | గురువారం 24.09.2026 | ఎడిటర్ : కొమరరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




# గంగమ్మ ఒడికి గణపయ్య..

## గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు



- శోభాయాత్రకు సర్వం సిద్ధం.. 20 వేల మంది పోలీసులతో భద్రత
- వినాయక నిమజ్జనంపై పోలీసుల పటిష్ట నిఘా
- గణేశ్ శోభాయాత్రకు భారీ భద్రతా ఏర్పాట్లు
- నిమజ్జనానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం
- వినాయక నిమజ్జన వేళ అప్రమత్తమైన పోలీసులు
- శోభాయాత్రపై 10 వేల సీసీ కెమెరాలతో నిఘా

02

గణేశ్ నిమజ్జనానికి డ్రోన్లతో పటిష్ట నిఘా




### విద్వేశాలు రెచ్చగొడితే కఠిన చర్యలు:సీపీ సజ్జనార్

సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, పుకార్లు సృష్టించినా ఉపేక్షించబోం. హైకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే కేటాయించిన జలాశయాల్లో నిమజ్జనాలు చేపట్టాలి. హైదరాబాద్ విశిష్ట సంస్కృతి అయిన 'గంగా-జమునా తెహజీబ్'ను, సోదరభావాన్ని కాపాడుకుంటూ పోలీసులకు సంపూర్ణంగా సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. వాహనాల డ్రైవర్ల విషయంలో నిర్వాహకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అనుభవజ్ఞులైన వారిని నియమించుకోవాలి.

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

జీహెచ్ఎంసీ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఖైరతాబాద్ బడా గణేష్‌ను 25 లక్షలు, బాలాపూర్ వినాయకుడిని 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. కాగా నగర వ్యాప్తంగా నవరాత్రుల పాటు పూజలు అందుకున్న వినాయక ప్రతిమల నిమజ్జనం శుక్రవారం జరుగనుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా చూసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. మరోవైపు శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తలమునకలయ్యారు. గ్రేటర్ పరిధిలో విగ్రహాల నిమజ్జనం ప్రతిష్ఠించిన మూడవ రోజు నుంచే మొదలైంది.అయితే ఐదో రోజు నుంచే అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం మొదలు కావడంతో ముందే నిమజ్జనం చేసే చెరువుల వద్ద భక్తుల తాకిడి పెరిగింది. శోభాయాత్రకు 10 వేల సీసీ కెమెరాలు, 100 హైరైజ్ కెమెరాలు, 24 డ్రోన్లను వినియోగిస్తున్నారు. మొత్తం 20 వేల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టనున్నారు. గణేశ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్న లక్ష్యంతో...

ఏకదంతుని నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

# జూరాల నుంచి సాగునీటి విడుదల

## మంత్రుల రాయబారం సక్సెస్

సానుకూల స్పందన..నీరు విడుదల చేయాలని కన్నడ సీఎం ఆదేశం

పాలమూరు నీటి ఎద్దడిపై వివరించిన బృందం



- కృష్ణా జలాల కోసం డీకేను కలిసిన తెలంగాణ నేతలు
- తెలంగాణకు కృష్ణా జలాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- జూరాలకు నీటి విడుదలపై డీకేకు మంత్రుల విజ్ఞప్తి
- పాలమూరు రైతుల కోసం డీకేను కలిసిన మంత్రులు
- తెలంగాణకు నీటి విడుదలకు డీకే సానుకూల హామీ
- కృష్ణా జలాలపై తెలంగాణ మంత్రుల కీలక భేటీ
- జూరాల ఆయకట్టు పంటలకు నీటి కోసం విజ్ఞప్తి
- జూరాలకు దశలవారీగా నీటి విడుదలకు విజ్ఞప్తి

02

**నారాయణపూర్ నుంచి జూరాలకు నీటి విడుదల**

# స్టార్లు వెలుగును పంచేలా ఉండాలి

## హానికర ఉత్పత్తుల ప్రచారంపై రాష్ట్రపతి ముర్ము కీలక వ్యాఖ్యలు



- సెలబ్రిటీలకు రాష్ట్రపతి కీలక సూచనలు
- హానికర ఉత్పత్తుల ప్రచారంపై ముర్ము
- ప్రముఖులు బాధ్యతగా వ్యవహరించాలన్న ముర్ము
- 'రియల్ స్టార్స్ వెలుగు నివ్వాలి'
- సెలబ్రిటీల ప్రకటనలపై సోషల్ మీడియాలో చర్చ

02



ఎన్నికల విశ్వసనీయతపై రాజకీయ దుమారం

# ఓటు చోరీ దేశద్రోహం తో సమానం..

## ఓట్ల చోరీ రాజ్యాంగంపై దాడి

- ఓట్ల అక్రమాలపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ విమర్శలు
- ఓట్ల చోరీపై రాహుల్ ఘాటు వ్యాఖ్యలు
- ఎన్నికల నిర్వహణపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- ఓటు హక్కు పరిరక్షణపై రాహుల్ వ్యాఖ్యలు
- ఎన్నికల విశ్వసనీయతపై రాజకీయ దుమారం

03



# రిమ్స్ ఘటనపై కవిత హెచ్చరిక

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న కవిత**

- రిమ్స్‌లో చిన్నారుల మృతిపై కవిత మండిపాటు
- రిమ్స్ ఘటనపై సర్కార్‌కు కవిత డెడ్‌లైన్
- చిన్నారుల మృతిపై సీఎం రేవంత్‌కు కవిత ప్రశ్నలు

03

# ఎన్నికల కమిషన్‌లో తీవ్ర విభేదాలు!..

**ఈసీ నిర్ణయాలపై 14 సార్లు అభ్యంతరాలు**




- ఎస్ఐఆర్ పై ఈసీలో అంతర్గత విభేదాలు?
- ఓటర్ల జాబితాపై ఈసీ కమిషనర్ల అభ్యంతరాలు
- ఈసీ నిర్ణయాలపై 14 సార్లు అభ్యంతరాలు
- ఫారమ్-6 మార్పులపై కమిషనర్ల ప్రశ్నలు
- ఓటర్ల డేటా కేంద్రీకరణపై అభ్యంతరాలు
- ఈసీ తీరుపై విపక్షాల తీవ్ర విమర్శలు
- జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాల ఆగ్రహం
- ఎస్ఐఆర్ పై దుమారం.. ఏకగ్రీవ నిర్ణయాలేనన్న ఈసీ

03

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

**రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**




- వరద ముప్పు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- భారీ వర్షాలు.. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుకు ఆదేశం
- వర్షాల నేపథ్యంలో కలెక్టర్లకు పొంగులేటి దిశానిర్దేశం
- రెడ్ అలర్ట్ జిల్లాల్లో అధికారుల అప్రమత్తత

02

### గణేష్ నిమజ్జనాలున్నయ్ ఆలోచించి చెబుతాం



- నాని కోరికపై డీజీపీ ఆనంద్ స్పందన
- భద్రతా సమీక్ష తర్వాతే తుది నిర్ణయం
- హీరో నాని చిత్ర బృందానికి డీజీపీ ఆనంద్ ట్వీట్

02

# ఇది ఎల్ నినో కాదు.. ఎల్ కాంగ్రెస్.!

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. కరెంట్ కటకట తెచ్చింది..**

- రాష్ట్రంలో నిరంతరం కరెంట్ కోతలు
- రోజులో కనీసం ఆరు గంటలు కూడా విద్యుత్ ఉండటం లేదు
- ఇది ఎల్నినో ప్రభావం కాదు.. కాంగ్ లినో ప్రభావం
- బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ ఇచ్చాం
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03



థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తిపై కేటీఆర్ ఆరా

**బొగ్గు సరఫరాపై కేటీఆర్ కీలక ప్రశ్నలు**




సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఇక పండగే..

# కేబినెట్ భేటీలో సరికొత్త పాలసీకి ఆమోదం

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు

ఇన్‌ఫ్లుయెన్సర్ల పాలసీకి ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

ఫాలోవర్లను బట్టి నగదు.. కొత్త పాలసీకి ఆమోదం

డిజిటల్ ప్రచారానికి కొత్త పాలసీ.. ఇన్‌ఫ్లుయెన్సర్లకు చెల్లింపులు

లక్షకు పైగా ఫాలోవర్లకు రూ.15 వేల వరకు

ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఫాలోవర్ల ఆధారంగా నగదు చెల్లింపులు

03

# జూరాల నుంచి సాగునీటి విడుదల



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పలువురు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, ముధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు కృష్ణా జలాలు విడుదల చేయాలని వారు కోరారు. నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతుల దుస్థితిని డీకేకు వివరించారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ 4 ప్రాజెక్టుల కింద 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోందని వివరించారు. ప్రస్తుతం ఆయకట్టు పరిధిలోని పంటలు కీలక దశలో ఉన్నాయని.. నీటి కొరత వస్తే పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని వివరించారు. అంతేకాకుండా రైతుల ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడుతుందని మంత్రులు తెలిపారు. నెలలో 5 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలు విడుదల చేయాలని కోరారు. మంత్రుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం డీకే శివకుమార్.. తెలంగాణ రైతులకు లాభం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే మహబూబ్ నగర్ జిల్లా జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు అధికారులు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూల నిర్ణయంతో నీటి విడతలకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు కూడా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరులోనే ఉన్నారు. గతరాత్రి కర్ణాటక ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. నారాయణపూర్ నుండి జూరాలకు దశలవారీగా 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. ఈరోజు మరోసారి కర్ణాటక సీఎం, ఇరిగేషన్ మంత్రి, అధికారులతో ఎమ్మెల్యేలు భేటీకానున్నారు. నారాయణపూర్ లో ప్రస్తుతం 28 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

# స్టార్లు వెలుగును పంచేలా ఉండాలి

**ఢిల్లీ :** సినీ నటులు తమకున్న ప్రజాదరణను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులను ప్రచారం చేసే ముందు వారు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారామె. అయితే.. ముర్ము వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో చర్చలు జోరందుకున్నాయి. హానికరమన్న ప్రాడక్ట్స్‌ను ప్రచారం చేయొద్దని చెబుతున్నప్పుడు.. వాటి తయారీ, విక్రయాలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాగా.. నిన్న(మంగళవారం) 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల కార్యక్రమంలో భాగంగా.. రాష్ట్రపతి ముర్ము సినీ ప్రముఖులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా యువత, పిల్లలపై సినీ తారలు చూపే ప్రభావాన్ని ప్రస్తావించారు. ప్రముఖుల మాటలు, చేతలు కోట్లాది మంది ప్రజల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయన్న ఆమె.. వాటిని సమాజహితానికి మాత్రమే ఉపయోగించాలని సూచించారు. 'రియల్ స్టార్స్ వెలుగును పంచాలి.. చీకటిని కాదు' అన్న ఆమె వ్యాఖ్యలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తులకు ప్రచారకర్తలుగా వ్యవహరించడానికి ముందు వారు సామాజిక బాధ్యతను గుర్తుంచుకోవాలని ఆమె పరోక్షంగా సూచించారు. అయితే.. రాష్ట్రపతి వ్యాఖ్యలకు పలువురు మద్దతు తెలుపగా.. మరి కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. ముఖ్యంగా చిన్నారులు, యువతపై సినీ తారల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ప్రముఖుల ప్రకటనల విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కొందరు పేర్కొన్నారు. అసలు సమస్య సెలబ్రిటీల ప్రచారంతోనే ముగిసిపోదని ఇంకొందరు కామెంట్ చేశారు. ఒక ప్రాడక్ట్ ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వం భావిస్తే.. దాని తయారీ, అమ్మకాలను ఎందుకు నిషేధించడం లేదని వారు నిలదీశారు. కాగా.. పాన్‌మసాలా వంటి ఉత్పత్తులకు సినీ ప్రముఖులు ప్రచారం చేయడంపై ఇప్పటికే వివాదం చెలరేగింది. గత ఆగస్టులో మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ తుకారాం ముండే.. ఆ ప్రకటనతో సంబంధమున్న బాలీవుడ్ నటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవ్‌గణ్, టైగర్ ష్రాఫ్‌లకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ఇకపై ఇంటికే మీసేవ సేవలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రజా పాలనను పౌరులకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రభుత్వ సేవలను నేరుగా ఇంటి వద్దకే అందించే 'మీసేవ డోర్ డెలివరీ' సదుపాయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ నూతన విధానం ద్వారా పౌరులు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గానీ, అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా గానీ తమకు అనుకూలమైన సమయానికి స్లాట్ బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి మీసేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా దరఖాస్తుదారుల ఇంటికే చేరుకుని, సంబంధిత దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేస్తారు. ఈ డోర్ డెలివరీ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన ఈసీ (ఎన్‌కంబరెన్స్) కాపీలు, ఐజీఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు, పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ ధ్రువీకరణ సేవలు ప్రజలకు గడప వద్దే సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు ఇప్పటికే మొదటి విడతలో 70 మందికి పైగా మీసేవ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తొలి దశలో భాగంగా హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని, అక్కడ వచ్చే స్పందన, అనుభవాలను పరిశీలించిన అనంతరం త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాలకు మీసేవ డోర్ డెలివరీ సేవలను విస్తరిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

# నీళ్లు ఇవ్వడం చేతగాని దద్దమ్మ ప్రభుత్వం

**నాగర్‌కర్నూల్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. దేశంలో ఎక్కడా క్రాప్ హాలిడే లేదని, తెలంగాణలో మాత్రమే క్రాప్ హాలిడే కొనసాగుతోందని అన్నారు. నీళ్ల లేక కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాక రైతాంగం కన్నీళ్లు పెడుతోందని ఆరోపించారు. బుధవారం కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ భవన్‌లో మీడియాతో హరీశ్ రావు మాట్లాడారు. కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వడం చేతకాని ప్రభుత్వం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకురావాల్సి ఉండగా, కేవలం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే వినియోగించుకుంటున్నారని హరీశ్ రావు తెలిపారు. మిగిలిన నీటిని సీఎం గురువు చంద్రబాబు తన సొంత జిల్లాకు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. ఐదు మోటార్లతో 24 గంటల పాటు ప్రాజెక్టును నడపాల్సి ఉండగా, కేవలం మూడు మోటార్లతో ఎనిమిది గంటలు మాత్రమే నడుపుతూ నీటిని విడుదల చేస్తున్నారని విమర్శించారు. 4 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పుడు కేవలం 800 క్యూసెక్కులు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వరంగల్ జిల్లాలోని దేవాదుల ప్రాజెక్టులో సమ్మక్క బ్యారేజీని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. గోదావరిలో నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు ఎందుకు నీటిని విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. నల్లగొండను ముంచి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు మళ్లిస్తున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం సాధించిందేమిటని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్రీశైలం నుంచి 88 టీఎంసీల నీటిని తీసుకున్నట్లు చెప్పారని, వాస్తవానికి 8.8 టీఎంసీలు మాత్రమే తీసుకున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రజలకు ఇలా అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపించారు. పాలమూరు జిల్లాను కరువు జిల్లాగా మార్చింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని హరీశ్ రావు గుర్తుచేశారు. పాలమూరు జిల్లా బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ జిల్లాకు నీళ్లు ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలంలో 96 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ-3 కాలువలో మిగిలిన పనులను పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదుల్లో లభ్యమయ్యే నీటిని వినియోగించుకుని 24 గంటల పాటు నీటిని ఎత్తిపోసి రైతులకు అందించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎథిక్స్ కమిటీ సమావేశం..!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అసెంబ్లీ కమిటీ హాల్‌లో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ సమావేశం ముగిసింది. సభలో పాడి కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిపై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి కమిటీ విచారణ చేపట్టింది. తాజాగా కౌశిక్ రెడ్డి సమర్పించిన వివరణ, ఆయన కోరిన అదనపు గడువు, సభా కార్యకలాపాలకు సంబంధించిన ఫుటేజీ అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. సమావేశంలో ప్రధానంగా పాడి కౌశిక్ రెడ్డి కమిటీకి రాసిన లేఖకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. వివరణ ఇవ్వడానికి తనకు ఆరు వారాల గడువు కావాలని కౌశిక్ రెడ్డి గతంలో కమిటీని కోరారు. ఆ రోజు అసెంబ్లీలో జరిగిన పూర్తి కార్యకలాపాల వీడియో ఫుటేజీని కూడా అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కౌశిక్ రెడ్డి కోరిన ఆరు వారాల గడువును మరింత పొడిగించాలా? లేదా? అనే అంశంపైనా కమిటీ చర్చించారు. అయితే ఈ అంశంపై బీఆర్ఎస్‌కు చెందిన కమిటీ సభ్యులు గడువు ఇవ్వాలని కోరారు. కాకపోతే ఈ అంశంపై తుది నిర్ణయం ఏమిటనేది స్పష్టంగా వెల్లడి కావాల్సి ఉంది. అసెంబ్లీ ఘటనకు సంబంధించిన మరికొంత సీసీటీవీ ఫుటేజీని ఇవ్వాలని బీఆర్ఎస్ సభ్యులు కోరగా.. అదనపు ఫుటేజీ ఇవ్వడంపై కొంత అభ్యంతరం వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఘటనకు సంబంధించిన ఫుటేజీని కమిటీ పరిశీలనకు ఉంచినట్లు సభ్యులు సూచించారు. చివరకు 30వ తేదీకి కమిటి విచారణను వాయిదా వేసింది

# గంగమ్మ ఒడికి గణపయ్య..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జీహెచ్ఎంసీ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఖైరతాబాద్ బడా గణేష్‌ను 25 లక్షలు, బాలాపూర్ వినాయకుడిని 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. కాగా నగర వ్యాప్తంగా నవరాత్రుల పాటు పూజలు అందుకున్న వినాయక ప్రతిమల నిమజ్జనం శుక్రవారం జరుగనుండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా చూసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. మరోవైపు శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తలమునకలయ్యారు. గ్రేటర్ పరిధిలో విగ్రహాల నిమజ్జనం ప్రతిష్ఠించిన మూడవ రోజు నుంచే మొదలైంది. అయితే ఐదో రోజు నుంచే అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం మొదలు కావడంతో ముందే నిమజ్జనం చేసే చెరువుల వద్ద భక్తుల తాకిడి పెరిగింది. శోభాయాత్రకు 10 వేల సీసీ కెమెరాలు, 100 హైరైజ్ కెమెరాలు, 24 డ్రోన్లను వినియోగిస్తున్నారు. మొత్తం 20 వేల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టనున్నారు. గణేశ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 12న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా ఈ నెల 13న డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని ప్రభుత్వ విభాగాలతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించి, క్షేత్రస్థాయి సిబ్బందికి కచ్చితమైన మార్గదర్శకాలు జారీ చేశారు. మరోవైపు మహిళలు, యువతుల భద్రతకు పెద్దపీట వేస్తూ మూడు షిఫ్టుల్లో 26 షీ టీమ్స్ బృందాలు అందుబాటులో ఉంచారు. నిమజ్జనం రోజున నేర నియంత్రణ కోసం సీసీఎస్ పరిధిలో 139 మంది సిబ్బందిని 5 సెక్టార్లుగా విభజించి, 25 ప్రత్యేక బృందాలుగా మఫ్టీలో నిఘా ఉంచనున్నారు. ఆపదలో ఉన్న మహిళలు తక్షణమే డయల్ 112 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ సిటీ పోలీస్ లు విజ్ఞప్తి చేశారు.

**14,929 మండపాల ఏర్పాటు..**

నగరవ్యాప్తంగా మండపాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా 15,426 దరఖాస్తులు రాగా, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 14,929 మండపాలకు అనుమతులను మంజూరు చేశారు. అనుమతి పొందిన అన్ని మండపాలను 'జియో ట్యాగింగ్' చేయడంతో పాటు ప్రమాద నివారణ, విద్యుత్ తీగల రక్షణ జాగ్రత్తలపై తెలుగు, ఆంగ్ల భాషల్లో ముద్రించిన పోస్టర్లను మండపాల వద్ద అతికించారు. ఇప్పటివరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32,878 విగ్రహాల నిమజ్జనం విజయవంతంగా ముగియగా, అందులో హైదరాబాద్ నగరానికి చెందిన 6,108 విగ్రహాలు ఉన్నాయి. గత 24 గంటల్లోనే నగర పరిధిలోని 2,161 విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. శోభాయాత్ర సాఫీగా సాగేందుకు బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ఉత్సవ సమితులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సంయుక్త రూట్ తనిఖీలు పూర్తిచేసి రోడ్ల మరమ్మతులు, విద్యుత్ తీగల తొలగింపు, చెట్ల కొమ్మల కత్తిరింపులు వంటి పనులు పూర్తి చేశారు.

**అందుబాటులో గజ ఈతగాళ్లు..**

శోభాయాత్ర మార్గాల్లోని ఎత్తైన భవనాల పైకప్పులపై అత్యాధునిక బైనాక్యులర్లు, వైర్‌లెస్ సెట్లతో సిబ్బందిని మోహరించి ప్రధాన కంట్రోల్ రూమ్‌కు పోలీస్ అధికారులు అనుసంధానం చేశారు. బంజారాహిల్స్‌లోని ప్రధాన జాయింట్ కంట్రోల్ రూమ్‌తో పాటు ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్, మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటైన ప్రత్యేక కంట్రోల్ రూముల్లో అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు పర్యవేక్షిస్తారు. ప్రధాన జలాశయాలు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆర్మీ, పర్యాటక శాఖలకు చెందిన నిపుణులైన గజ ఈతగాళ్లను, రెస్క్యూ బోట్లను సిద్ధంగా ఉంచారు. విద్యుత్ అంతరాయాలు కలగకుండా మొబైల్, స్టాటిక్ జనరేటర్లు, రాత్రి వేళల్లో నిఘా కోసం వాచ్ టవర్లు, వైద్య సేవల కోసం పారామెడికల్ సిబ్బందితో కూడిన అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలు సిద్ధం చేశారు. వాహనాలు మొరాయిస్తే ట్రాఫిక్ నిలిచిపోకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్ల వద్ద మెకానిక్‌లు, అదనపు డ్రైవర్లను సైతం అందుబాటులో ఉంచారు.

**విద్వేశాలు రెచ్చగొడితే కఠిన చర్యలు:సీపీ సజ్జనార్**

గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా ముగించేందుకు హైదరాబాద్ సిటీ పోలీసు యంత్రాంగం తరఫున అన్ని రకాల పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. నగర ప్రజలంతా సంయమనం పాటిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, పుకార్లు సృష్టించినా ఉపేక్షించబోం. హైకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే కేటాయించిన జలాశయాల్లో నిమజ్జనాలు చేపట్టాలి. హైదరాబాద్ విశిష్ట సంస్కృతి అయిన 'గంగా-జమునా తెహజీబ్'ను, సోదరభావాన్ని కాపాడుకుంటూ పోలీసులకు సంపూర్ణంగా సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. వాహనాల డ్రైవర్ల విషయంలో నిర్వాహకులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అనుభవజ్ఞులైన వారిని నియమించుకోవాలి.

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

# గణేష్ నిమజ్జనాలున్నయ్ ఆలోచించి చెబుతాం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తన భారీ బడ్జెట్ మూవీ పారడైజ్ ను ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్లోచూడాలన్నహీరోనాని అభ్యర్థనపై డీజీపీ సీవీ ఆనంద్ స్పందించారు. వారి కోరికను అభినందిస్తున్నామని, అయితే నిమజ్జ నాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లపై హైదరాబాద్ నగర పోలీసు లతో సంప్రదించాల్సి ఉందని తెలిపారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, 10వ రోజు రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హుస్సేన్సాగర్లో వేలాది విగ్రహాలు నిమజ్జనం కానున్నాయని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ హుస్సేన్సాగర్కు సమీపంలో ఉండటంతో నిమజ్జన వాహనాలు, భక్తులు, ప్రజలతో ఆ ప్రాంతం భారీగా రద్దీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ క్రాస్రోడ్స్లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన పోలీసు బలగాలను మోహరించగలమా? అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని తెలిపారు.



సుమారు రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ మృతి చెందడంతో పాటు ఓ చిన్నారి శాశ్వత వైకల్యానికి గురైన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసులతో సంప్రదించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని సీవీ ఆనంద్హీరోనాని, దర్శకుడు ఓదెల శ్రీకాంత్ ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఇది ఎల్ నినో కాదు.. ఎల్ కాంగ్రెస్.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో విద్యుత్ సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణకు కరెంట్ విలాసం కాదని, జీవనరేఖ అని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిపై తమ పార్టీ తరఫున వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు ఆరు బృందాలను పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రాంతాలకు పంపుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనే విద్యుత్ అంశం కీలకంగా ఉందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ విద్యుత్ రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ల సంఖ్యను పెంచడంతో పాటు విద్యుత్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టారని, తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కేటీఆర్ ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో ఆరు గంటలకు మించి కరెంట్ రావడం లేదని, విద్యుత్ సమస్యలపై మండలాల్లో ధర్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలకు వాతావరణ పరిస్థితులను కారణంగా చూపడాన్ని కేటీఆర్ విమర్శించారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని.. 'ఎల్ కాంగ్రెస్' ప్రభావమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. విద్యుత్ సరఫరా, ఉత్పత్తిపై బీఆర్ఎస్ నేతలు గత కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. ఇటీవల హరీశ్ రావు కూడా పలు విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తి సామర్థ్యానికి తగ్గ స్థాయిలో జరగడం, బొగ్గు లభ్యతపై ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణిలో బొగ్గు కొరత, నాణ్యతపై కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. నాలుగు నెలల క్రితమే తమ పార్టీ నేతలు సింగరేణిలో బొగ్గు కొరత, అక్రమాలపై ఆరోపణలు చేశారని చెప్పారు. బొగ్గు అందుబాటులో ఉంటే థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. తెలంగాణలోని థర్మల్ ప్లాంట్లకు నాణ్యమైన బొగ్గు సరఫరా అంశంపై ఇప్పటికే చర్చ జరుగుతోంది. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సహా కొన్ని ప్లాంట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. నీటి లభ్యత తగ్గడంతో కొన్ని హైడల్ యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. థర్మల్ ప్లాంట్లలోనూ ఉత్పత్తి తగ్గిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. గత వారం రోజుల్లో తెలంగాణలో మూడు థర్మల్, రెండు హైడల్ విద్యుత్ యూనిట్లలో ఉత్పత్తి నిలిచిపోయినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ సమయంలో ఈ యూనిట్ల నిలిపివేతతో సరఫరాపై ఒత్తిడి పెరిగినట్లు నివేదికలు తెలిపాయి. విద్యుత్ రంగంలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు బీఆర్ఎస్ తరఫున ఆరు బృందాలు పవర్ ప్లాంట్లను సందర్శించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు జగదీశ్ రెడ్డి బృందం, కేటీపీఎస్‌కు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బృందం, భద్రాద్రి పవర్ ప్లాంట్‌కు పువ్వాడ అజయ్ బృందం వెళ్లనున్నట్లు చెప్పారు. అలాగే సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని కూడా బీఆర్ఎస్ బృందం సందర్శిస్తుందని తెలిపారు. ఆయా ప్రాంతాలను పరిశీలించి విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, ప్లాంట్ల పరిస్థితిపై వివరాలు సేకరిస్తామని కేటీఆర్ వెల్లడించారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడానికి అసలు కారణాలు ఏమిటి? బొగ్గు సరఫరాలో సమస్యలు ఎందుకు వచ్చాయి?

ప్లాంట్లు పూర్తి సామర్థ్యంతో ఎందుకు పనిచేయడం లేదనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అయితే కేటీఆర్ చేసిన పలు ఆరోపణలపై ప్రభుత్వం నుంచి సమగ్ర అధికారిక వివరణ ఈ వ్యాఖ్యల సమయంలో అందుబాటులో లేదు.



## ఓటు చోరీ దేశద్రోహం తో సమానం..

**ఢిల్లీ :** భారత ఎన్నికల నిర్వహణ, ఓట్ల అవకతవకలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పై నిప్పులు చెరిగారు. ఓట్ల చోరీ అనేది భారత ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న మహా నేరమని, ఇది మన రాజ్యాంగం పై జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విడుదల చేసిన వీడియోలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవస్థీకృతంగా ఈ ఓట్ల దోపిడీకి పాల్పడుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), ఎన్నికల సంఘం (ఈసీ) ముమ్మాటికీ దేశద్రోహానికి ఒడిగట్టాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా జరుగుతున్న ఇలాంటి కుట్రలకు కాలం చెల్లుతుందని, భారత ప్రజలకు త్వరలోనే న్యాయం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. దీనికితోడు విడుదల చేసిన వీడియో సందేశంలో కేంద్ర ఎన్నికల సంఘం తో పాటు సంబంధిత ఎన్నికల అధికారులనుద్దేశించి రాహుల్ గాంధీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాజ్యాంగబద్ధంగా నిష్పాక్షికంగా విధులు నిర్వర్తించాల్సిన ఎన్నికల అధికారులు అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని గట్టిగా స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు, ఓటర్ల పవిత్రమైన హక్కుల సాధనకు కాంగ్రెస్ పార్టీ చివరి వరకు రాజీలేని పోరాటం చేస్తుందని పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల విశ్వసనీయతపై విపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నల నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# ఎన్నికల కమిషన్‌లో తీవ్ర విభేదాలు!..

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ చుట్టూ దేశ రాజకీయం తీవ్ర సంచలనంగా మారింది. ఈసీ తీరు ప్రతిపక్షాలకు నష్టం కలిగించేలా, అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తోందని ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం అంతర్గత నిర్ణయాలపై ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక కథనం తీవ్ర దుమారం రేపుతోంది. గడిచిన 10 నెలల్లో తమకు తెలియకుండానే జారీ చేసిన పలు ఉత్తర్వులు, నిబంధనల మార్పులపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషిలు కనీసం 14 సార్లు అధికారికంగా రికార్డు పూర్వకంగా అభ్యంతరాలు తెలిపినట్లు ఈ కథనం పేర్కొంది. ముఖ్యంగా 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960' చట్టాన్ని సవరించకుండా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారమ్-6లో మార్పులు చేయడం చట్టవిరుద్ధం అని కమిషనర్లు పేర్కొనడం, క్షేత్రస్థాయి అధికారులను పక్కనపెట్టి ఓటర్ల డేటాను న్యూఢిల్లీ కేంద్రంగా కేంద్రీకృతం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ విషయంలో ఏకంగా కేబినెట్ కార్యదర్శికి లేఖలు రాయడం ఈసీలో అంతర్గత విభేదాలను స్పష్టం చేస్తోందని ఈ కథనం పేర్కొంది.

**జ్ఞానేశ్ కుమార్‌పై విపక్షాలు ఫైర్:**

ఈ కథనం వెలువడిన నేపథ్యంలో ఆప్‌తో పాటు ఇండియా కూటమిలోని కీలక పార్టీలు ఎన్నికల సంఘం తీరుపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ లక్ష్యంగా విమర్శలు గుప్పించాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు స్పందిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేలా రాజ్యసభలో 'ఇంపీచ్‌మెంట్' తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. సీఈసీ స్థానంలో ఉన్నంత వరకు పారదర్శకమైన ఎన్నికలు జరగవని శివసేన ఆరోపించగా, రాజ్యాంగబద్ధమైన ఈసీ వ్యవస్థ పూర్తిగా అధికార పక్షం చేతిలో "కీలుబొమ్మ"గా మారిందని సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. అంతేకాకుండా, ఈ వ్యవహారంలో పారదర్శకతను కాపాడేందుకు అత్యున్నత నాయస్థానం సుప్రీంకోర్టు తక్షణమే 'సుమోటో'గా జోక్యం చేసుకోవాలని ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

**ఏకగ్రీవమే:**

కమిషనర్ల అభ్యంతరాల అంశం బయటకు రావడంతో ఈసీ తీరుపై విపక్షాలు పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం చేశాయి. దీంతో జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై ఈసీ అధికారాలు స్పష్టతనిచ్చారు. ఎన్నికల కమిషనర్లు పలు అంశాలను లేవనెత్తినప్పటికీ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈసీ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న తరుణంలో ఈ అంశం జాతీయ రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు కేరాఫ్ అవుతుందో చూడాలి మరి.

# ప్రజల సంక్షేమమే లక్ష్యం

**తిరుమలగిరి,ఫ్లాష్ ఇండియా :** తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ.7 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తాటిపాముల గ్రామం తనకు కన్నతల్లిలాంటిదని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా జీవితాంతం పుట్టిన గడ్డ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయి విద్యా ప్రమాణాలు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా అందాలనే లక్ష్యంతో ఆధునిక సదుపాయాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి పాఠశాల తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తాటిపాములలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.80 లక్షలతో ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మహిళా సమాఖ్య సభ్యుల కోసం శ్రీశక్తి భవనానికి రూ.20 లక్షలు, చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

**దేవాదుల జలాలతో సాగునీరు**

స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల మెరుగుదలతో పాటు సాగునీటి వనరులు, మౌలిక వసతుల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేవాదుల ఫేజ్-36 కాలువ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపట్టి రైతులకు నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. త్వరలో కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేసి తిరుమలగిరి ప్రాంతానికి దేవాదుల జలాలను అందించడమే లక్ష్యమన్నారు. బునాదిగాని, ఆసిఫ్‌నగర్ కాలువల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి అడ్డగూడూరు, శాలిగౌరారం, మోత్కూరు మండలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య**

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు విద్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తాటిపాములలో పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీఎస్ఆర్ నిధులను సమీకరించి అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి రూ.6 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

**వంతెన నిర్మాణానికి హామీ**

జానకిపురం--తాటిపాముల గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి భవిష్యత్తులో కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. తుంగతుర్తి--తిరుమలగిరి ప్రాంతాలకు దేవాదుల ఫేజ్-2, 36 ద్వారా సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం వాస్తాకొండూరు--తాటిపాముల గ్రామాల మధ్య నిర్మిస్తున్న వంతెన పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అదనపు కలెక్టర్ హరి సింగ్, జిల్లా ఎస్పీ నరసింహ, ఆర్డీఓ వేణు మాధవరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, ఏఐసీసీ నాయకులు సర్వోత్తమ్‌రెడ్డి, సూర్యాపేట ఏఎంసీ చైర్మన్ వేణారెడ్డి, తిరుమలగిరి ఏఎంసీ చైర్మన్ వై.చామంతి నరేష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ బోయపల్లి కిషన్, ఉపసర్పంచ్ బోనాసి ఎల్లమ్మ, గ్రామ పెద్ద నలమాద సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాద ఘటన..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ప్రమాదంలో బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లుగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లుగా ఆయన స్పష్టం చేశారు.

**చిన్నారులకు మెరుగైన వైద్యంపై ఆదేశాలు**

రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులైన పిల్లల పరిస్థితిని మంత్రి రాజనర్సింహ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఆయన, మెరుగైన వైద్యం అందించేందుకు వెంటనే హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన అన్ని వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసీనిచ్చారు.

**రిమ్స్‌లో 150 బెడ్లతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం..**

అయితే, ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా రిమ్స్‌లో 150 బెడ్లతో నూతనంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం ను నిర్మించనున్నట్లుఇవ మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. త్వరలోనే అత్యాధునిక వసతులతో ఈఎంసీహెచ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి దామోదర స్పష్టం చేశారు.

## రిమ్స్ ఘటనపై కవిత హెచ్చరిక

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆదిలాబాద్ రిమ్స్ లో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్, ఏసీ పేలి ఐదుగురు చిన్నారులు మరణించారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదిలాబాద్ సురక్ష చిల్డ్రన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రిమ్స్ ఎస్ఎన్‌సీయూ అగ్ని ప్రమాద ప్రమాద బాధిత శిశువుల తల్లిదండ్రులను ఇవాళ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి... మీరు దత్తత తీసుకున్న జిల్లాలో ఐదు మంది పసి పిల్లలు చనిపోతే వచ్చి చూసేందుకు తీరక లేదా? అని ప్రశ్నించారు. ఫుట్ బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం ఉంటోంది కానీ మైనార్టీ, ఆదివాసీ పిల్లలు చనిపోతే చూసే టైమ్ కూడా లేదా? అని నిలదీశారు.

**నెల రోజుల గడువు:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక నెల సమయం ఇస్తున్నామని ఆలోపు పెండింగ్‌లో ఉన్న హెల్త్ బిల్స్ రిలీజ్ చేయాలని, ఆదివాసీ గూడెలకు రోడ్లు వేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు వచ్చాయో లెక్కలు అన్నీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. తాము విధించిన గడువు లోపు ఆసుపత్రికి నిధులు విడుదల కాకపోయినా, రోడ్లు బాగుచేయలేకపోయినా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఆదివాసీలందరితో ఘెరావ్ చేస్తామని హెచ్చరించారు. తాము ఆశామాషీగా వచ్చి చూసి వెళ్లే టూరిస్ట్ పార్టీ కాదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సగం మంది స్టాఫ్, డాక్టర్లు, శానిటేషన్ సిబ్బంది కూడా లేరని కనీసం చీపుర్లు, ఫినాయిల్, దూది, మందులు కొనుగోలు చేయడానికి కూడా మెయింటెనెన్స్ బడ్జెట్ లేదన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.500 కోట్లు ఉన్నాయంటే ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమేన్నారు. ఏసీ పేలి ఇంత ఘోరం జరిగింది. కానీ ఈ ఆసుపత్రిలో 150 ఏసీలు ఉంటే ఒక్క మెకానిక్ కూడా లేరని మండిపడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ ఆసుపత్రికి రావాలని డిమాండ్ చేశారు.

# ఆ సాఫ్ట్ వేర్ చుట్టూ వివాదం!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారంటూ జాతీయ మీడియాలో వచ్చిన కథనం దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై రాజకీయ పక్షాలు స్పందిస్తున్నాయి. దేశంలో ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని పలు పార్టీలు డిమాండ్ చేస్తున్న వేళ ఈ వివాదంపై బీఆర్ఎస్ సైతం స్పందించింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటో తీసుకుని విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ కాబట్టి.. ఈ అంశంపై దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు తప్ప మరే ఇతర సంస్థను మనం విశ్వసించలేం. ఈ వ్యవహారంపై అనేక ప్రశ్నలు, అనుమానాలు ఉన్నాయని ప్రస్తుతం ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర విశ్వాస సంక్షోభం నెలకొందన్నారు.

**కేంద్రబిందువుగా 'ఈరోనెట్':**

ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా మూడో దశకు చేరుకున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ 'ఈరోనెట్' తీవ్ర వివాదస్పదంగా మారింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో దాదాపు 1.76 కోట్ల మంది (17.6 మిలియన్ల) ఓటర్లకు సాఫ్ట్‌వేర్‌లోని 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (సమాచారంలోవ్యత్యాసాలు) కింద అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే ఒకవైపు సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఏర్పడిందనే విమర్శలు వెల్లువెత్తుతుండగా మరోవైపు ఈ సాఫ్ట్‌వేర్ నియంత్రణ, అధికారాల కేంద్రీకరణపై ఎన్నికల కమిషనర్ల మధ్యే తీవ్ర స్థాయిలో విభేదాలు బయటపడటం కలకలం రేపుతోంది. ముఖ్యంగా ఓటర్ల జాబితా నమోదు వ్యవస్థ కేంద్రీకృతం కావడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని గత 10 నెలల కాలంలో ఈ విధానంపై వారు కనీసం 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలను నమోదు చేశారని జాతీయ మీడియాలో వచ్చిన కథనం సంచలనంగా మారింది. చట్టప్రకారం క్షేత్రస్థాయిలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు మాత్రమే ఓటర్ల జాబితాలను నిర్వహించే పూర్తి చట్టబద్ధమైన అధికారం ఉంటుందని అయితే ఈరోనెట్ పోర్టల్‌పై రాష్ట్ర ఎన్నికల అధికారులకు, EROలకు పూర్తి స్థాయి యాక్సెస్ ఉండటం లేదని, వారి అధికారాలను హరిస్తూ సాంకేతిక విభాగానికి బాధ్యత వహించే డిజిటల్ డైరెక్టర్ జనరల్ సీమా ఖన్నా వద్దే నియంత్రణ కేంద్రీకృతమవుతోందని కమిషనర్లు ప్రశ్నిస్తున్నట్లు ఈ కథనం పేర్కొంది. దీంతో ఈరోనెట్ సాఫ్ట్ వేర్ చుట్టూ ఈ వివాదం ముదురుతోంది. తెలంగాణలోనూ స్వల్ప తేడాలున్నాయన్న కారణంతో అనేక మంది ఓటర్లకు నోటీసులు వచ్చాయి. ఈ నోటీసులకు సైతం ఈరోనెట్ సాఫ్ట్ వేరే కారణం అనే చర్చ జరుగుతోంది.

# కేబినెట్ భేటీలో సరికొత్త పాలసీకి ఆమోదం

**ఆంధ్రప్రదేశ్ :** సీఎం చంద్రబాబు అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వీలుగా రాష్ట్రంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీ కి మంత్రివర్గం అధికారికంగా ఆమోదం తెలిపింది. డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రభుత్వ సందేశాన్ని సమర్థవంతంగా ప్రచారం చేసే లక్ష్యంతో ఈ కొత్త విధానాన్ని రూపొందించారు.

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల గుర్తింపు, ధ్రువీకరణ**

రాష్ట్రంలో సోషల్ మీడియా వేదికగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని ఈ పాలసీ ద్వారా భాగస్వామ్యం చేసుకోనున్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో భాగంగా విశ్వసనీయమైన ఇన్‌ఫ్లుయెన్సర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ధ్రువీకరించనుంది. పారదర్శకమైన విధానంలో అర్హులైన డిజిటల్ క్రియేటర్లను ఎంపిక చేసి వారికి తగిన గుర్తింపు



కల్పించడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం.

**ఫాలోవర్ల ఆధారంగా ఖాతాల్లోకి నగదు జమ..**

ఈ సరికొత్త పాలసీలో భాగంగా ఇన్‌ఫ్లుయెన్సర్లను వారి సోషల్ మీడియా ఖాతాల ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వివిధ కేటగిరీలుగా విభజించనున్నారు. లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్న వారికి గరిష్టంగా రూ.15 వేల చొప్పున చెల్లించనున్నారు. అలాగే 50 వేల నుంచి 99,999 వరకు ఫాలోవర్లు ఉన్న వారికి రూ.7,500 అందజేస్తారు. అదేవిధంగా 25 వేల నుంచి 49,999 మంది ఫాలోవర్లు ఉన్న వారికి రూ.5 వేలు, 10 వేల నుంచి 24,999 వరకు ఫాలోవర్లు ఉన్న వారికి రూ.2,500 వరకు ప్రత్యామ్నాయంగా వారి సంబంధిత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

# సంపాదకీయం



## పంట పండితే సరిపోదు..

# ధర దక్కాలి!

పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్ ధర కుప్పకూలితే రైతు పరిస్థితి ఏమిటి? సాగు సమయంలో విత్తనం నుంచి ఎరువు వరకు పెట్టుబడి పెట్టి, కష్టపడి పంట పండించిన అన్నదాతకు చివరికి గిట్టుబాటు ధర కూడా దక్కకపోతే ఆ వ్యవసాయం ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్న మరోసారి తెలంగాణ ప్రభుత్వ ముందుకు వచ్చింది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, జొన్న, మొక్కజొన్న వంటి పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో.. కోతల సమయంలో ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోతే రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ఎవరిపై అన్నది కీలకంగా మారుతోంది. వ్యవసాయ రంగంలో కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకటించడం ఒక విషయం. ఆ ధరకు రైతు పంటను విక్రయించుకునేలా కొనుగోలు వ్యవస్థను అందుబాటులో ఉంచడం మరో విషయం. కాగితాలపై మద్దతు ధర ఉన్నా.. మార్కెట్‌లో వ్యాపారులు అంతకంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే రైతుకు ఆ ధరతో ప్రయోజనం ఉండదు. అందుకే ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ బలంగా ఉండటం అత్యంత అవసరం. ప్రస్తుతం పప్పుధాన్యాలు, నూనెగింజలు, కొప్రా వంటి కొన్ని ఉత్పత్తులను ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద కేంద్రం సేకరిస్తోంది. అయితే మొక్కజొన్న, జొన్న వంటి పంటలు ఈ పరిధిలో లేవు. ఫలితంగా మార్కెట్ ధరలు ఎంఎస్పీ కంటే దిగువకు పడిపోతే రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ అంశాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం అందుకే ప్రాధాన్యత సంతరించుకుంది. పీఎస్ఎస్ కింద సాధారణంగా రాష్ట్ర సీజన్ ఉత్పత్తిలో నిర్దిష్ట పరిమితి మేరకే సేకరణకు అవకాశం ఉండటం కూడా మరో సమస్య. దేశీయ పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో తూర్, ఉరద్, మసూర్ వంటి పంటలను అధిక పరిమాణంలో సేకరించేందుకు కేంద్రం ప్రత్యేక అవకాశం కల్పించింది. ఇదే తరహాలో అన్ని పప్పుధాన్యాలు, నూనెగింజలకు సేకరణ పరిమితిని విస్తరించాలని రాష్ట్రం కోరుతోంది. రైతులు సాగు చేయాలని ప్రోత్సహించిన తర్వాత.. పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్ రక్షణ కల్పించకపోతే ఆ ప్రోత్సాహం నిష్ప్రయోజనంగా మారే ప్రమాదం ఉంది. ఈ ఏడాది సాగు గణాంకాలు కూడా పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగింది. కందులు, పెసల సాగు కూడా విస్తరించింది. సోయా, ఇతర నూనెగింజల సాగు గత ఏడాదితో పోలిస్తే పెరిగింది. జొన్న, మొక్కజొన్న సాగు కూడా విస్తృతంగా జరుగుతోంది. ఇది ఒక కోణంలో రైతుల పంటల వైవిధ్యానికి సంకేతం. కానీ మరో కోణంలో చూస్తే.. ఒకేసారి భారీగా పంట మార్కెట్‌కు వస్తే ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఇక్కడే ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ అసలు పరీక్ష ఎదుర్కోనుంది. రైతుల నుంచి పంటను సేకరించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదు. సేకరించిన ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలి? ఎంతకాలం నిల్వ చేయాలి? నాణ్యతను ఎలా కాపాడాలి? అవసరమైనప్పుడు ఎక్కడ విక్రయించాలి? అన్న ప్రశ్నలకు కూడా సమాధానాలు సిద్ధంగా ఉండాలి. తగినన్ని శాస్త్రీయ గిడ్డంగులు లేకపోతే తాత్కాలిక నిల్వ కేంద్రాలపై ఆధారపడాల్సి వస్తుంది. అప్పుడు రవాణా, నిల్వ, నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. అంతేకాదు.. ప్రభుత్వం ఒక ధరకు పంటను కొనుగోలు చేసి, తర్వాత మార్కెట్‌లో అంతకంటే తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తే నష్టం ఎవరు భరించాలి? చివరకు అది ప్రభుత్వ ఆర్థిక భారంగా మారుతుంది. అంటే రైతుకు ధర రక్షణ కల్పించాలంటే కొనుగోలు చేసిన క్షణంతో బాధ్యత ముగియదు. సేకరణ నుంచి నిల్వ, రవాణా, విక్రయం వరకు మొత్తం వ్యవస్థను సమర్థంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ విషయంలో మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ సంస్థల సామర్థ్యం కీలకం. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న సంస్థలపై భారీ సేకరణ బాధ్యత పడితే బ్యాంకు రుణాలు, వడ్డీ భారం, ప్రభుత్వ పూచీకత్తులు వంటి అంశాలు ముందుకు వస్తాయి. రైతుకు ధర రక్షణ కల్పించడం అవసరమే అయినప్పటికీ.. ఆ రక్షణ వ్యవస్థ ఆర్థికంగా కూడా నిలకడగా ఉండాలి. ఇక్కడ కేంద్రం, రాష్ట్రం మధ్య సమన్వయం అత్యవసరం. పంట సాగు నిర్ణయాలు రైతులు తీసుకున్నప్పటికీ.. దేశ ఆహార భద్రత, దిగుమతుల నియంత్రణ, ధరల స్థిరీకరణ వంటి అంశాలు జాతీయ స్థాయిలో ప్రభావం చూపుతాయి. కాబట్టి పీఎస్ఎస్ పరిధి, సేకరణ పరిమితులు, నిధుల విడుదల వంటి అంశాల్లో కేంద్రం స్పష్టమైన విధానం రూపొందించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో రాష్ట్రం కూడా కొనుగోలు కేంద్రాలు, గిడ్డంగులు, రవాణా, నిధుల లభ్యతపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. రైతుకు కావాల్సింది కేవలం పంట పండించే స్వేచ్ఛ కాదు.. పండించిన పంటకు న్యాయమైన ధరపై నమ్మకం. ప్రభుత్వం ఒక పంటను సాగు చేయమని ప్రోత్సహిస్తే, మార్కెట్‌లో ధర పడిపోయినప్పుడు రైతు ఒంటరిగా మిగలకూడదు. అదే సమయంలో ప్రతి ధర పతనాన్నీ ప్రభుత్వ కొనుగోలుతో పరిష్కరించడం కూడా దీర్ఘకాలిక మార్గం కాదు. అందుకే ముందస్తు మార్కెట్ అంచనాలు, పంటల సాగు ప్రణాళిక, నిల్వ సామర్థ్యం, ధరల స్థిరీకరణ నిధి, సమర్థవంతమైన కొనుగోలు వ్యవస్థ, రైతులకు ప్రత్యక్ష మార్కెట్ అవకాశాలు-ఇవన్నీ ఒక సమగ్ర విధానంలో భాగం కావాలి. పంట పండించమని రైతును ప్రోత్సహించడం ఎంత ముఖ్యమో.. పంట పండిన తర్వాత అతని శ్రమకు తగిన ధర దక్కేలా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. వానాకాలం పంటల కోతలు ప్రారంభమయ్యేలోపు ఈ వ్యవస్థ ఎంత సిద్ధంగా ఉందోనే రాబోయే రోజుల్లో అసలు పరీక్ష.

# పడిపోతున్న భూగర్భజలాలు..

## కరువు కోరల్లో తెలుగు రాష్ట్రాలు.. తాగునీటికీ తప్పని కటకట



నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 15 శాతం తక్కువ వర్షపాతంనమోదు కాగా, ఎల్ నినో కూడా ఏర్పడటంతో తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమై 28 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. గత 17 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా అత్యంత కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో దేశంలోని పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. సాగునీటికే కాక, తాగు నీటికి కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయి. బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ సీజన్ మొత్తంలో దేశవ్యాప్తంగా 15 శాతం టులో వర్షపాతం నమోదైంది. ఇక దక్షిణాది రాష్ట్రాలను చూస్తే అత్యధికంగా ఏపీలో 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. తెలంగాణలో కూడా 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మరోవైపు ఎల్‌నినో ప్రభావం రోజు రోజుకు ఎక్కువుతోంది. అల్పపీడనంతో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తున్నా.. ఏపీలోని అత్యధిక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులే ఉన్నాయి. పల్నాడు, ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే వేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు. పత్తి, కంది, మినుము, ఆముదం, వేరుశనగ తదితర పంటలు ఎండుతున్నాయి. ఏపీ వ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు వేయగా.. అందులో 2.44 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని పంటలపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సుమారు 41,474 హెక్టార్లలో వేసిన పైర్లు ఎండు దశకు చేరాయి. 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోయాయి. మరో 1,92,387 హెక్టార్లలోని పంటలు తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. 284 మండలాలు, 1,792 రైతు సేవా కేంద్రాల పరిధిలోని పంటలపై ఎల్‌నినో తీవ్రత అధికంగా ఉంది. ప్రతి ఏడాది సెప్టెంబర్ లో భారీ వర్షాలు,వరదలు, తుఫాన్లు వచ్చేవి. ఎటు చూసినా ప్రాజెక్టులు నిండుకుండల్లా ఉండేవి. కానీ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాకాలం కూడా మరో వేసవిని తలపిస్తోంది. ఎండలకుతోడు వేడి గాలులుతో జనాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పంట పొలాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అధిక మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. కర్నూలు జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో సాగవుతున్న పైర్లపై ప్రభావం ఎక్కువగా ఉంది. 74,301 హెక్టార్లలో కంది, 73,733 హెక్టార్లలో పత్తి, 25వేల హెక్టార్ల మొక్కజొన్న, 18వేల హెక్టార్ల వరి నీరందక ఎండుతోంది. బత్తాయి, మామిడి, ఇతర ఉద్యాన పంటలూ ఎండుదశకు చేరుతున్నాయి. ఒక్కో తోటలో పదుల సంఖ్యలో చెట్లు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో కరవు పరిస్థితులు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ప్రధాన జలాశయాలు పూర్తిగా అడుగంటాయి. భూగర్భ జలమట్టాలు పడిపోయి పల్లెలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. కల్యాణి డ్యాంలో నీరు మరో నెలకు మాత్రమే సరిపోయే పరిస్థితి ఉండటంతో తిరుపతి, తిరుమలలో సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. రాబోయే రోజుల్లో వర్షాలు కురవక, వరద ప్రవాహం రాకపోతే అందుబాటులో ఉన్న నీరు మరో నెల రోజులకు మాత్రమే సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జలాశయం పరిసరాల్లో నీరు తగ్గిపోయి రాళ్లు, రప్పలు తేలి కనిపిస్తున్నాయి. వానాకాలం చివరి రోజుల్లో అయినా వర్షాలు పడకపోతే ఆధ్యాత్మిక క్షేత్రాలైన తిరుపతి, తిరుమలలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చే ప్రమాదం పొంచి ఉంది. ఎల్ నినో నెల్లూరు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చెరువులు ఎండిపోయి సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు..మెట్ట ప్రాంతంలో వర్షాలు లేక రైతులు అల్లాడిపోతున్నారు.. సోమశిల కండలేరు జలాశయాలలో ఎప్పుడూ లేని విధంగా కనిష్ట స్థాయికి నీటి నిల్వలు దిగజారాయి. సాగుకు సిద్ధం కావాల్సిన రైతులు దిక్కుతోచని స్థితిలోఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొన్నిచోట్ల బత్తాయి తో పాటు వాణిజ్య పంటలు నీరు లేక ఎండిపోయిన పరిస్థితులు కూడా ఉన్నాయి. అప్పుడప్పుడు కరుస్తున్న వానలు పెద్దగా ఆదుకోలేకపోతున్నాయి. కాకినాడ జిల్లాలో ఇప్పటివరకు 60 శాతం లోటు వర్షపాతం వుంది. దీంతో పంటలు వేసిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదు. రిజర్వాయర్లు కాలువలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నీటి ఎద్దడి అంతకంతకు ఎక్కువవుతుంది. కొన్నిచోట్ల పంటలు సాగు చేయలేక వదిలేసారు. ఒకవైపు పంటలు ఎండిపోతుంటే మరోవైపు కనీసం పశువులకు మేత కూడా దొరకడం లేదు. ఎల్‌నినో గుంటూరు జిల్లాలో తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఓ వైపు వర్షాలు లేక... మరోవైపు భూగర్భజలాలు తగ్గిపోవడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు... వర్షాలపై ఆశతో పంటలు సాగు చేసిన రైతులు కళ్లముందే అవి ఎండిపోతుండడంతో ఆవేదన చెందుతున్నారు. పల్నాడు జిల్లాలో 50వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది సాగునీరు విడుదల కాకపోవడంతో 70శాతం వరి సాగు విస్తీర్ణం తగ్గింది. బోర్ల కింద సాగు చేసిన పత్తి,మిర్చి పంటల్ని అన్నదాతలు కాపాడుకోలేని పరిస్థితి నెలకొంది. పల్నాడు జిల్లాలో గతేడాది 60వేల ఎకరాల్లో మిర్చిసాగు చేస్తే ఈ ఏడాది ఎల్ నినో ఎఫెక్ట్ తో 20వేల ఎకరాల్లో మిర్చిసాగు మొదలుపెట్టారు రైతులు. ఎకరాకు 50నుంచి 60వేల వరకూ రైతులు ఇప్పటికే ఖర్చుచేశారు. కానీ వర్షాలు కురవకపోవడంతో మిర్చిపంట ఎండిపోవడం మొదలైంది. దీంతో పంటను కాపాడుకునేందుకు మిర్చిరైతులు నీళ్లకోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. నీళ్లకోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తోంది. విశాఖలో తాగునీటికోసం తీవ్రకష్టాలు పడుతున్నారు మహిళలు. ఖాళీ బిందెలు పట్టుకుని నీళ్లకోసం పోరాడాల్సిన దుస్థితి. ఇక్కడే కాదు చాలాచోట్ల తాగునీటి కష్టాల ఎదురువుతున్నాయి. పరిస్థితి మరింత విషమించకముందే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను ముమ్మరం చేయాలని జనం కోరుతున్నారు. బోర్లు పునరుద్ధరించడం, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొత్తానికి ఎల్ నినో ఏపీలో పలు జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాలు కురవకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. సాగు కోసం చేసిన అప్పులు కళ్ల ముందు కదలాడుతుంటే అన్నదాతలు ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ఉన్న పంటలైనా ఎలా కాపాడుకోవాలన్న ఆందోళన వాళ్లకి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అయితే సాగునీటిపై ముందే ఆశలు వదులుకున్న సర్కారు.. తాగునీటికి కొరత రాకుండా ప్రణాళికలు రూపొందించినా.. అడుగంటుతున్న భూగర్భజలాలు.. ఆ ప్లాన్లకు కూడా సవాల్ విసురుతున్నాయి. దీంతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కౌంటర్ యాక్షన్ ప్లాన్ కోసం ముందడుగు వేస్తోంది. తాగునీటి కొరత తీవ్రమైతే.. ప్రజలు ప్యానిక్ అవుతారని, ఆ పరిస్థితి రాకుండా చూడాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. కొన్నేళ్లుగా సమృద్ధిగా వర్షాలు పడి.. నీటి కొరత ఏంటో చూడని జనం.. ఇప్పుడు సాగునీటికే కాకుండా తాగునీటికీ కటకట ఏర్పడటాన్ని చూసి భయపడుతున్నారు. సాధారణంగా రిజర్వాయర్లలో నీళ్లు లేకపోతే.. వానలు కురవకపోతే.. భూగర్భజలాల్ని నమ్ముకుంటారు. కానీ ఈసారి బోర్లు వేసినా కూడా భూగర్భజలాలు అడుగంటిపోవడం.. తీవ్ర కరవు ఛాయలకు అద్దం పడుతోంది. మామూలుగా అయితే ఓ రాష్ట్రంలో నీటి కొరత ఉంటే.. మరో రాష్ట్రం నుంచైనా నీళ్లు తీసుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు దేశవ్యాప్తంగా నీటికొరత ఉండటంతో.. ఎవర్నీ అడగలేని, అడిగినా వారూ ఇవ్వలేని దుస్థితి నెలకొంది. దీంతో ఇటు ఏపీ, అటు తెలంగాణ కూడా ఉన్న నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవడంపై దృష్టి సారిస్తున్నాయి. నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచిస్తున్నాయి. తెలంగాణలో ఏపీతో పోలిస్తే వానలు పర్వాలేదనిపించినా.. కురవాల్సినంత వర్షాలైతే పడలేదనే చెప్పాలి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పుడు భూగర్భజలం కూడా అడుగంటడంతో.. తాగునీటికీ కొరత వచ్చి పడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతకుమించి ప్రాజెక్టుల్లో తాగునీటి కోసం ఉంచిన నీటి నిల్వల్ని కూడా సాగు కోసం విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్న దుస్థితి కనిపిస్తోంది. తెలంగాణలో మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే 123 శుద్ధి కేంద్రాలకు రాష్ట్రంలోని 29 ప్రధాన జలాశయాలు ఆధారంగా ఉన్నాయి. ఈ 29 జలాశయాల మొత్తం నిల్వ సామర్థ్యం 1,059 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం కేవలం 333.44 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయంలో 522.31 టీఎంసీల నిల్వలు ఉండగా.. గతంతో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత దిగజారింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి పైన వినియోగించదగిన నీరు కేవలం 3 టీఎంసీలే మిగిలి ఉండగా.. ప్రతి నెల తాగునీటి అవసరాలకు సుమారు అర టీఎంసీ అవసరం అవుతోంది. లోయర్ మానేరు, ఎల్లంపల్లి, కడెం, జూరాల, నాగార్జునసాగర్, నిజాంసాగర్, సింగూర్, కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి, వైరా, ఉదయసముద్రం, ధర్మసాగర్ వంటి జలాశయాల్లోనూ నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలు ఈ జలాశయాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వలతో మంజీరా, సింగూర్, గోదావరి వ్యవస్థల నుంచి ఈ నెలాఖరు వరకు మాత్రమే తాగునీరు అందించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ అవసరాల కోసం సింగూర్‌లో కనీసం 16 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖకు సూచనలు వెళ్లాయి. ఇదిలా ఉండగా భూగర్భ జలాల పరిస్థితి కూడా దిగజారుతోంది. జూన్ నాటికి రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం 9.46 మీటర్ల లోతుకు పడిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని బోర్లను మరింత లోతుగా తవ్వడం, అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతోంది. అయితే భారీ వర్షాలు త్వరలో కురవకపోతే.. కృష్ణా-గోదావరి జలాశయాల్లో నిల్వలు పెరగకపోతే తెలంగాణలో రానున్న నెలల్లో తాగునీటి సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ఎక్కడికక్కడ పొలాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రంలో కరువు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలమట్టాలు కూడా క్రమంగా పడిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతుండగా.. సాగునీటి సమస్య మరింత తీవ్రమవుతోంది. తాగునీటి సమస్య కూడా రానున్న రోజుల్లో పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, భూగర్భ జలాల కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. పాలమూరు, ఖమ్మం, నల్లగొండ సహా పలు జిల్లాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలమూరు జిల్లాలో జూన్, జూలై నెలల్లో కంటే సాగుకు కీలకమైన ఈ నెలలో ఏకంగా 80 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఫలితంగా దాదాపు 4.58 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. ఆ ప్రాంతం..ఈ ప్రాంతమని కాదు..ఎక్కడ చూసినా వర్షాభావమే. ఎల్‌నినో ధాటికి రైతులు విలవిలలాడుతున్నారు. వానలు పడక, భూగర్భ జలాలూ లేక పంటలు ఎండిపోతుంటే తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. సాగు చేసిన పంటలను రక్షించుకుందామంటే ప్రాజెక్టుల కింద నీరు విడుదల కావటం లేదు. వరిసాగు చేయొద్దని అధికారులు హెచ్చరించినప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్లలో నీరు వస్తుందని భావించిన రైతులు పంటలు వేసుకోగా ఇప్పుడవి ఎండిపోతున్నాయి. ఆరుతడి పంటల పరిస్థితి కూడా అలాగే ఉంది. చాలా జిల్లాల్లో 40 శాతం పంటలు ఎండిపోయాయి. మిగతా పంటల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోయే అవకాశం వుంది. పంటలు ఎండిపోవడంతో పలుచోట్ల వరి పొలాలను పశువుల మేతకు వదిలేస్తుండటం కలిచివేస్తోంది. వరుణుడు కరుణించకపోడా..వాన రాకపోదా అన్న చిన్న ఆశ కూడా లేకుండా పోతోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ప్రభుత్వ సొమ్ముతో మిల్లర్ల జల్సాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర పౌర–సరఫరాల శాఖకు రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వేల కోట్ల రూపాయల బకాయిల వసూళ్ల వ్యవహారం రాష్ట్రంలో ఇప్పుడు తీవ్ర చర్చ–నీయాంశంగా మారింది. ప్రజాధనంతో వ్యాపారం చేసి.. తిరిగి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును మాత్రం ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల నుంచి వసూలు చేయాల్సిన బకాయిలు ఏకంగా రూ.6,650 కోట్లకు పైగా పెండింగులో ఉండటం ఆందోళన కలిగించే అంశం. అయితే.. ఇప్పటివరకు సివిల్ సప్లయిస్ వాళ్లు మాత్రం 'యాక్షన్ పాడి ప్లాన్' ద్వారా సుమారు రూ.1,200 కోట్లు మాత్రమే వసూలు చేయడం గమనార్హం.మరోవైపు.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి సైతం దాడులు నిర్వహిస్తూ మిల్లర్లకు నోటీసులు ఇస్తున్నప్పటికీ వారి నుంచి పెద్దగా స్పందన లేదని తెలుస్తోంది. విజిలెన్స్ విభాగానికి ఎంతవరకు వసూళ్లు అయ్యాయో లెక్కలు సైతం వారు వెల్లడించడం లేదు. బకాయిల్లో సింహభాగం ఇంకా ప్రభుత్వ ఖాతాలోకి రాకపోవడంతో.. మిగిలిన రూ.5,450 కోట్లకు పైగా డబ్బులను ఎప్పుడు, ఎలా రికవరీ చేస్తారన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంటే.. మరోవైపు బకాయిలు చెల్లించాల్సిన కొందరు మిల్లర్ల యాజమాన్యాలు మాత్రం కొత్త వ్యాపారాల్లోకి అడుగుపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**బకాయిలు పెరుగుతుంటే.. ఆస్తులు పెరుగుతున్నాయా..**

ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ము పేరుకుపోతున్నప్పటికీ కొందరు మిల్లర్లు తమ వ్యాపార కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు, కొత్త వ్యాపారాలు, విలాసవంతమైన జీవనం, సినిమా నిర్మాణం వంటి రంగాల్లోకి కొందరు అక్రమార్కులు ప్రవేశించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ బకాయిలను చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పే యాజమాన్యాలే కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే స్థోమత ఎలా సాధిస్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బకాయిదారుల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, పెట్టుబడులపై సమగ్ర విచారణ జరిగితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అంటున్నారు.

**సీఎం ఆదేశాలను లైట్ తీసుకున్నారా?**

బకాయిల రికవరీకి స్పష్టమైన కాలపరిమితి, కఠినమైన కార్యాచరణ ఉన్నప్పటికీ.. క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు నత్తనడకన సాగుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. కొందరి విషయంలో నోటీసులు, మరికొందరి విషయంలో కేసులు.. ఇంకొందరి విషయంలో చర్చలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే తరహా బకాయిలున్న యాజమాన్యాలపై ఎందుకు ఒకే రకమైన చర్యలు ఉండటం లేదు? ఎవరి బకాయిలు ఎంత? ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎంత వసూలు చేశారు? ఇంకా ఎంత రికవరీ చేయాల్సి ఉంది? అనే ప్రశ్నలకు అధికారికంగా సమగ్ర సమాధానం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు.. మిల్లర్ల నుంచి బకాయిలను వసూలు చేయాలని ఇటీవల ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ వసూళ్లలో పెద్దగా ఆశించిన మార్పు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తవ–ంవుతున్నాయి. ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తామని ప్రకటించినా.. వాస్తవంగా బకాయిల రికవరీ మాత్రం నెమ్మదిగా సాగుతున్నదన్న అభిప్రాయం అధికార వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

**క్రిమినల్ కేసులకూ భయపడేది లేదు..!**

బకాయిల వసూళ్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వారు పలు మిల్లుల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి.. వారం రోజులైనా రిప్లై ఇవ్వకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. ఈ చర్యలు తీసుకున్నా వాటి ప్రభావం వారిపై పెద్దగా చూపడం లేదని తెలుస్తోంది. కేసులు నమోదైన తర్వాత కూడా బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం, వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. కేసు నమోదవుతుంది.. నోటీసు వెళ్తుంది.. విచారణ జరుగుతుంది.. కానీ ప్రభుత్వానికి రావాల్సిన అసలు మొత్తం మాత్రం ఖాతాలోకి రావడం లేదనే పరిస్థితి నెలకొంది.

**రూ.1,200 కోట్లే వసూలు**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం బకాయిలు రూ.6,650 కోట్లకు పైగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే.. వాటిలో నుంచి ఇప్పటివరకు సివిల్ సప్లయిస్ విభాగం మాత్రం యాక్షన్ పాడి కింద సుమారు రూ.1,200 కోట్లు వసూలు చేసింది. అంటే భారీ మొత్తం ఇంకా రికవరీ కావాల్సి ఉంది. బకాయిల వ్యవహారంపై విజిలెన్స్ దర్యాప్తు, కేసులు, రికవరీ వంటి అంశాలు కీలకంగా మారినా.. పూర్తి వివరాలు మాత్రం బహిరంగం కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత మొత్తానికి సంబంధించి కేసులు ఉన్నాయి? ఎన్ని కేసుల్లో రికవరీ జరిగింది? ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలపై స్పష్టత లేకుండా పోయింది. ఇటీవల కొన్నిచోట్ల మిల్లులపై చర్యలు తీసుకుంటున్నా.. ఆ భయం మాత్రం మిగితా మిల్లర్లలో కనిపించకపోవడం చర్చకు దారితీస్తున్నది.

**ప్రజాధనంతో జల్సాలు**

ప్రభుత్వానికి రావాల్సిన వేల కోట్ల రూపా–యలు బకాయిగా ఉండగా.. అదే సమ–యంలో కొందరు బకాయిదారులు రియల్ ఎస్టేట్, సినిమా నిర్మాణం, ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందులో పెట్టుబడులు పెడుతూ భారీ ఎత్తున ఆస్తులు కూడబెడుతున్నారన్న టాక్ నడుస్తున్నది. బకాయిదారుల వారీగా వివరాలు సేకరించి, రికవరీకి గడువులు నిర్ణయించి, చెల్లింపులు చేయని వారిపై చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది. ఇదిలాఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లు తెరమీదకు కొత్త వాదన తీసుకొచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లో వారి అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేసుకొని.. తమను ప్రభుత్వం వేధించొద్దు అంటూ తీర్మానం చేశారు.అంతేకాకుండా.. తమపై కేసులు నమోదు చేయవద్దని.. విజిలెన్స్ దాడులు చేయొద్దని.. విజిలెన్స్ దాడులను వెంటనే నిలిపివేయాలని.. కస్టమ్ మిల్లింగ్ రైస్ ఒప్పందాన్ని ఇరుపక్షాలకు న్యాయబద్ధంగా ఉండేలా రూపొందించాలని.. మిల్లర్లకు ఎలాంటి పెనాల్టీలు విధించవద్దంటూ ఇటీవల ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో తీర్మానం చేశారు. ఓ వైపు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు వేల కోట్లు పెండింగ్‌లో పెట్టినప్పటికీ వాటిపై మాత్రం మాట్లాడకపోవడం చర్చకు దారితీసింది. అంతేకాకుండా.. రివర్స్‌లో ప్రభుత్వమే వారిని వేధిస్తున్నట్టు ధర్నాలు, ఆందోళనలు చేస్తుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ఒకవైపు ప్రభుత్వ సొమ్మును రూ.వేల కోట్లలో దోచేసిన మిల్లర్లే మళ్లీ తమను ప్రభుత్వమే వేధిస్తున్నదని ఆరోపణలు చేస్తుండటం వారికే చెల్లిందని పలువురు అంటున్నారు.



## పోరాడితే పోయేదేమీ లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జూరాల ప్రా–జెక్టు నుంచి ఎడమ, కుడి కాలువల ద్వారా సాగునీటిని అధికారులు ఈ రోజు ఉదయం విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో పంట పొలాలకు సాగునీరు ప్రారంభమైన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప!" అన్న ప్రసిద్ధ నినాదాన్ని ప్రస్తావిస్తూ, హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన అన్నదాతల పోరాట పటిమను ఆయన వేనోళ్ల కొనియాడారు. ప్రాజెక్టు నుంచి నీరు అందక పొలాలు పూర్తిగా ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సాహసోపేతమైన పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ 'కుంభకర్ణ ప్రభుత్వాన్ని' ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించిన అన్నదాతలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.రైతుల పోరాటంలో అండగా నిలిచి, నిర్బంధాలను ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో కలిసి నడిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరికీ కేటీఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చే విధంగా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రానున్న రెండేళ్ల పాటు తమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, పోరాడడం, తెలంగాణ హక్కుల సాధన కోసం అవసరమైతే ఎవరితోనైనా రాజీలేని కొట్లాట చేయడమే బీఆర్ఎస్ ముందున్న ప్రధాన లక్ష్యమని తేల్చిచెప్పారు. రైతులతో కలిసి చేసిన ఈ ఒత్తిడి వల్లే ఎట్టకేలకు ప్రభుత్వం దిగొచ్చి కాలువల ద్వారా నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మేయర్ అధికారాలకు చెక్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) చట్టం మున్సిపల్ కార్పొరేషన్ల పాలకవర్గాల అధికారాలను కుదించేలా ఉందన్న అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని పలు రాజకీయ పార్టీల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సీఎం అధ్యక్షతన ఏర్పాటు కానున్న అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్, అధికారులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా మేయర్, కార్పొరేషన్ పాలకవర్గాల నిర్ణయాధికారాలకు పరిమితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటుండగా.. భారీ బడ్జెట్‌తో కూడిన ప్రాజెక్టులకు మాత్రమే ప్రభుత్వ అనుమతి కోసం సిఫారసు చేస్తున్నారు. క్యూర్ చట్టం అమల్లోకి వస్తే అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటే సరిపోనుంది.

**కార్పొరేషన్లకు గడువు విధించే అధికారం..**

మున్సిపల్ కార్పొరేషన్లు చట్టం ద్వారా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోతే ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకునేలా చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. విధులను సమర్థవంతంగా నిర్వహించకపోయినా, వాటికి అవసరమైన ఆర్థిక కేటాయింపులు చేయకపోయినా ప్రభుత్వం సంబంధిత కార్పొరేషన్, కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయవచ్చు. అందిన సమాచారం, నివేదికలను పరిశీలించిన అనంతరం ఏదైనా సంస్థ తన విధులను అసంపూర్ణంగా, అసమర్థంగా లేదా అనుచితంగా నిర్వహిస్తున్నట్లు తేలితే.. నిర్ణీత గడువులోగా వాటిని సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించవచ్చు. విధుల నిర్వహణకు అవ–సరమైన ఆర్థిక వనరులు కేటాయించాలని కూడా ప్రభుత్వం సూచించవచ్చు. అయితే అత్యవసరంగా ఆదేశాలు అమలు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భావిస్తే.. ముందుగా కార్పొరేషన్‌కు వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించాలని చట్టంలో పొందుపర్చారు.

**మున్సిపల్ పన్నులపై రుణం..**

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి నిర్దిష్ట మొత్తాన్ని డిబెంచర్ల ద్వారా రుణంగా సేకరించేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. ఇందుకు సంబంధిత మున్సిపల్ పన్నుల ఆదాయాన్ని భద్రతగా ఉంచే అవకాశం ఉంటుంది. సాధారణంగా కార్పొరేషన్ రుణాలు తీసుకునే సమయంలో వర్తించే నిబంధనలు, పరిమితులు, విధానాలే ఈ రుణాలకు వర్తిస్తాయి. ప్రస్తుతం కార్పొరేషన్ ఆదాయం, ఆస్తుల విలువ ఆధారంగా రుణాలు తీసుకునే అవకాశం ఉండగా.. కొత్త చట్టం ద్వారా పన్నుల నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రత్యేకంగా రుణానికి భద్రతగా ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు.

**తీర్మానాలు, అనుమతుల రద్దుకు అధికారం..**

క్యూర్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లపై ప్రభుత్వానికి మరిన్ని విస్తృత అధికారాలను చట్టంలో కల్పించారు. చట్టానికి విరుద్ధంగా లేదా అధికార పరిధిని మించి తీసుకున్న తీర్మానాలు, జారీ చేసిన ఉత్తర్వులు, మంజూరు చేసిన లైసెన్సులు, అనువ–ంతులను ప్రభుత్వం రద్దు చేయవచ్చు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న చర్యలను నిలిపివేసే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. కార్పొరేషన్ నిర్ణయం చట్టబద్ధంగా లేకపోయినా, చట్టం ద్వారా కల్పించిన అధికారాలను మించి ఉన్నా ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు. వాటి అమలుతో కార్పొరేషన్‌కు ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉన్నా, ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, భద్రతకు ముప్పు ఏర్పడినా, అల్లర్లు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తినా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే చట్టవిరుద్ధత లేదా అధికార పరిధి మించిన అంశాలపై చర్యలు తీసుకునే ముందు సంబంధిత వ్యక్తి లేదా సంస్థకు వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. ఇప్పటికే జరిగిన కార్పొరేషన్ ఎన్నికను ఈ నిబంధనల ఆధారంగా రద్దు చేసే అధికారం మాత్రం ప్రభుత్వానికి ఉండదు.

## సారీ.. సర్వర్ డౌన్..!



**చందానగర్(హైదరాబాద్),ఫ్లాష్ ఇండియా :** గ్రేటర్ హైదరాబాద్‌లోని మీ సేవ కేంద్రాల్లో సర్వర్ మొరాయిస్తోంది. ఉదయం నుంచి రాత్రివరకు ఇదే పరిస్థితి ఉంటుండడంతో వివిధ పనులపై వెళ్లిన పౌరులు, విద్యార్థులు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక గంటల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నారు. 2026–27 విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాలకు ఇటీవల తరలివెళ్తున్నారు.కాగా, దరఖాస్తుకు చివరితేదీ ఈ నెల 25 వరకు మాత్రమే ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టుకుని సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయాలంటే ముందుగా మీ సేవ కేంద్రాల్లో బయోమెట్రిక్ పూర్తి చేసుకోవాలి. తర్వాత ఆన్‌లైన్ సెంటర్స్‌లో దరఖాస్తును అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వారం రోజుల నుంచి మీ–సేవ కేంద్రాల్లో బయోమెట్రిక్ సర్వర్ అందుబాటులోకి రాకపోవడంతో చాలామంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.ఉదయం నుంచి రాత్రి వరకు వేచిచూస్తున్నా.. సర్వర్ రాకపోవడంతో నిరుత్సాహంతో ఇంటికి వెళ్తున్నారు. దీనిపై మీ సేవ సిబ్బందిని అడిగితే తమకు ఏమీ తెలియదని, పైనుంచి వస్తేనే తాము చేస్తామని సమాధానం చెబుతున్నారని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.



## భారత జీడీపీ అంచనాలను పెంచిన ఫిచ్, ఎస్అండ్‌పీ

**ఢిల్లీ :** ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన వృద్ధి సాధిస్తుండటంతో అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల అంచనాలు పెరుగుతున్నాయి. జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం వృద్ధి రేటును, దేశీయంగా పెరుగుతున్న వ్యాపార కార్యకలాపాలను ప్రాతిపదికగా తీసుకుని ఫిచ్, ఎస్అండ్‌పీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధి అంచనాలను పెంచాయి. ఫిచ్ రేటింగ్స్ భారత జీడీపీ అంచనాను 6.4 శాతం నుండి 6.9 శాతానికి సవరించగా, ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ 6.6 శాతం నుండి 7 శాతానికి పెంచింది. పారిశ్రామిక ఉత్పత్తులు పెరగడం, మౌలిక వసతుల్లో ప్రభుత్వ ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకోవడం, బలమైన వినియోగం ఈ వృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా నిలిచాయని రెండు సంస్థలు విశ్లేషించాయి. అయితే, ద్వితీయార్థంలో కొన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని ఏజెన్సీలు హెచ్చరించాయి. తక్కువ వర్షాలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలు గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తిపై, అలాగే సరఫరా వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను అదుపు చేసేందుకు, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు ఆర్‌బీఐ అక్టోబర్ సమీక్షలో తన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని రెండు సంస్థలు అంచనా వేశాయి.

# సీఎం రేవంత్ రిప్లై ఇదే.!

**ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో 'ది పారడైజ్' చూడాలన్న నాని..**



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నేచురల్ స్టార్ నాని నటించిన 'ది పారడైజ్' సినిమా సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 23న నిర్వహించనున్న ప్రీమియర్ షోను హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ప్రేక్షకులతో కలిసి వీక్షించేందుకు అనుమతి ఇవ్వాలని హీరో నాని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని సోషల్ మీడియా వేదికగా కోరారు. ఈ విషయమై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి కూడా స్పందించారు.ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా చూడటం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని నాని పేర్కొన్నారు. 'ది పారడైజ్' ప్రీమియర్ షో సందర్భంగా అక్కడి ఓ థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులతో కలిసి సినిమా చూడాలని ఉందని ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తెలంగాణ పోలీసు అధికారులను ట్యాగ్ చేస్తూ విజ్ఞప్తి చేశారు. సినిమాను ప్రేక్షకుల కోసమే రూపొందిస్తామని, అలాంటి ప్రేక్షకుల మధ్య కూర్చొని వారి స్పందనను ప్రత్యక్షంగా అనుభవించడంలోనే నటుడిగా తనకు నిజమైన సంతృప్తి లభిస్తుందని నాని తన పోస్టులో పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే సినిమాను అభిమానించే వ్యక్తిగా ప్రేక్షకులతో కలిసి సినిమా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ముఖ్యంగా తాను థియేటర్‌కు వచ్చే సమయంలో అమల్లో ఉన్న అన్ని నిబంధనలు, భద్రతా మార్గదర్శకాలను తప్పకుండా పాటిస్తామని నాని స్పష్టం చేశారు. ప్రేక్షకుల భద్రత కూడా తమకు అత్యంత ముఖ్యమని పేర్కొంటూ.. తన విజ్ఞప్తిని సీఎం, సినిమాటోగ్రఫీ మంత్రి, సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. హీరో నాని చేసిన విజ్ఞప్తిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. భద్రతా మార్గదర్శకాలను గౌరవించడంతో పాటు, తెలంగాణకు చెందిన యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన సినిమాపై నాని చూపిస్తున్న నిబద్ధతను అభినందించారు.అయితే ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ప్రీమియర్ షోకు హాజర–య్యేందుకు అధికారిక ప్రక్రియను అనుసరించాలని సీఎం సూచించారు. రద్దీని సజావుగా నిర్వహించడం, ప్రజల భద్రతను నిర్ధారించడం కోసం సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారిక దరఖాస్తు సమర్పించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. నాని సమర్పించే దరఖాస్తును సంబంధిత పోలీసు బృందం పరిశీలించి, తదుపరి నిర్ణయం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీని కూడా ట్యాగ్ చేశారు.

# ఫ్లాట్లు, బంగారం, పెట్టుబడులు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌పై అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో భారీగా ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. సుమారు 14 గంటలకు పైగా కొనసాగిన సోదాల్లో దాదాపు రూ.100 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలతో పాటు బంగారు ఆభరణాలను కూడా స్వా–ధీనం చేసుకున్నారు.ఎర్రగడ్డలోని కల్పతరువు అపార్ట్‌మెంట్‌లో ఉన్న డాక్టర్ లక్ష్మీ భాస్కర్ నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన బినామీలు, బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మె–ంత్తం ఏడు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు లభించినట్లు అధికారులు తెలిపారు. యాదాద్రి, నందిగామ, షామీర్‌పేట ప్రాంతాల్లో ఆస్తులను ఏసీబీ గుర్తించింది. షామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ఫ్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉకట్‌పల్లి, మణికొండ, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లోని హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీల్లోనూ పలు ఫ్లాట్ల వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.సోదాల సందర్భంగా అర కిలోకు పైగా బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ ఆస్తులకు సంబంధించిన పత్రాలను కూడా అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గుర్తించిన ఆస్తుల విలువను అధికారులు మరింతగా పరిశీలిస్తున్నారు. డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.41 లక్షల నగదు ఉన్నట్లు ఏసీబీ గుర్తించారు. పోస్టాఫీసుల్లో రూ.12 లక్షల డిపాజిట్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే సుమారు రూ.30 లక్షల విలువైన మ్యూచువల్ ఫండ్స్ కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.సోదాలు పూర్తైన తర్వాత.. డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో జైలుకు తరలించారు. డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన ఆస్తుల్లో కొంతమంది బినామీల పాత్రను కూడా ఏసీబీ అధికారులు గుర్తించారు. వారి వివరాలను సేకరించి నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. బినామీలను విచారించిన తర్వాత డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను కస్టడీలోకి తీసుకుని మరింత విచారణ చేపట్టే అవకాశం ఉంది.ఆస్తుల వివరాలను పరిశీలించే క్రమంలో డాక్టర్ లక్ష్మీ భాస్కర్ పలుమార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న సమయంలో ఇంత భారీగా ఆస్తులు ఎలా సమకూరాయనే అంశంపై దర్యాప్తు చేపట్టనున్నారు. కస్టడీ విచారణలో ఆస్తుల సమీకరణ, బినామీల పాత్ర, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## లక్కీ డ్రాలో పాత్రికేయుడికి అదృష్టం



**పెద్దపల్లి ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ జవహర్‌నగర్ కాలనీలో భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేశుడికి నైవేద్యంగా సమర్పించిన ఐదు కేజీల లడ్డూను ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు ముతికెల శ్రీధర్ అదృష్టవంతుడిగా గెలుచుకున్నారు. భక్తులందరికీ సమాన అవకాశాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఉత్సవ కమిటీ కూపన్ల ద్వారా లక్కీ డ్రా నిర్వహించింది. గణేశుడికి ప్రత్యేక పూజలు అనంతరం డ్రా తీయగా శ్రీధర్ విజేతగా నిలిచారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా భక్తుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆకుల కరుణాకర్, ఆకుల అంజయ్యతో పాటు భవాని యూత్ క్లబ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి.. ఉత్సాహం.. అదృష్టం.. కలిసి వచ్చిన ఈ లక్కీ డ్రా వినాయక నవరాత్రి వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

## గణేష్ నిమజ్జనం, శోభయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి





**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో గణేష్ నిమజ్జనానికి, శోభయాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ లోని ఒకటో నెంబర్ వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి, శోభ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేఖరులతో కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్గొండ మేయర్ ఇతర ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు జిల్లాలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లా వ్యాప్తంగా సుమారు 6000 విగ్రహాలు ఉన్నాయని, గడచిన 5 రోజుల నుండి నిమజ్జన ప్రదేశాలకు వినాయక విగ్రహాలు వస్తున్నాయని, బుధవారం నుండి శుక్రవారం వరకు మరో 2000 విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు. శోభాయాత్రను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రదేశాలలో ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ,ముఖ్యంగా శాంతి కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అన్ని నిమజ్జన ప్రదేశాల వద్ద వైద్య బృందాలు, రెవెన్యూ, పోలీస్ తో పాటు ,ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామని, భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనంలో భాగంగా బుధవారం ఒక్కరోజే 2000 వినాయక విగ్రహాలు జిల్లాలోని 8 నిమజ్జన ప్రదేశాలలో నిమజ్జనం జరిపెందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. వినాయక శోభాయాత్రకు, విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, శోభయాత్ర శాంతియుత వాతావరణంలో కొనసాగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, 14 మైలురాయి వద్ద నీళ్లు ఉన్నాయని, విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఈ నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## కన్నీటి శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం..



**వేములపల్లి,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కన్నీటి శాపంగా మారిందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కరరావు, భూపాల్‌రెడ్డిలు విమర్శించారు. బుధవారం వేములపల్లి మండల కేంద్రంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని భక్తిశ్రద్ధలతో పూజించిన అనంతరం నిమజ్జనం చేసేందుకు గంగ నీరు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ఎడమ కాలువలో నీరు లేకపోవడంతో భక్తులు వినాయక విగ్రహాల నిమజ్జనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మరో 20 రోజులపాటు సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేదని అన్నారు. ఆంధ్ర పాలకులు సాగర్ నీటిని తరలించుకుపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకుండా తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలతో పంట పొలాలు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సాగునీరు లేక, మరోవైపు విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో చివరి దశకు వచ్చిన పంటలు ఎండిపోతున్నాయని నాయకులు పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రేపు దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యను దృష్టిలో ఉంచుకుని నిర్వహించనున్న ఈ ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిర్ర మల్లయ్య యాదవ్, పాలుట్ల బాబయ్య, సర్పంచ్ పుట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం చేయడం అభినందనీయం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తుల కోసం ఏఎస్ వెజిటేబుల్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేయడం అభినందనీయమని అడిషనల్ ఎస్పీ రమేష్,ఆర్డిఓ అశోక్ రెడ్డి అన్నారు.నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్లో అన్నదానాన్ని ప్రారంభించి వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిస్వార్థంగా సొంత ఖర్చులతో ఆలంపల్లి సుధాకర్ అన్నదానాలు చేయడం అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ప్రతి సంవత్సరం అన్నదానం చేస్తున్న ఆలంపల్లి సుధాకర్, ఆలంపల్లి చంద్రశేఖర్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ అధ్యక్షుడు సోమయ్య,సింగం ప్రవీణ్ కుమార్,రాజశేఖర్,రాజు, కళ్యాణ్ వ్యాపారస్తులు పాల్గొన్నారు

## నేడు దామరచర్ల వై టి పి ఎస్ వద్ద టీఆర్ఎస్ నిరసన కార్యక్రమం

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గురువారం ఉదయం 10 గంటలకు మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్(వైటిపిఎస్) వద్ద బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రివర్యులు, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అద్వర్యంలో నిరసన కార్యక్రమం కలదు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ రైతులకు కరెంటు ఇవ్వనందున రైతులకు మొదటి పంటకు అండ్ రబీ సీజన్ పంటల సాగుకు నీళ్లు అందించడంలో విఫలమవుతున్న తీరును నిరసిస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యే లు,ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారు కావున మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు,రైతులు,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యువత,మహిళలు మరియు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నిఘా నీడలో కామారెడ్డి గణేష్ నిమజ్జన శోభాయాత్ర




**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర సాఫీగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో 420 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు శోభాయాత్ర మార్గంలో 162 సీసీ కెమెరాలు, 3 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గణేష్ నిమజ్జన బందోబస్తుపై జిల్లా ఎస్పీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బందోబస్తులో చేయవలసినవి, చేయకూడనివాటిపై పూర్తిగా వివరించారు.శోభాయాత్ర రూట్‌లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్లు, నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమన్వయంతో, ఓపికతో విధులు నిర్వహిస్తూ, అవసరమైనప్పుడు వెంటనే స్పందించాలని ఆదేశించారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, నిర్దేశిత రూట్ మ్యాప్ ప్రకారం శోభాయాత్ర సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లు, నిమజ్జన ఘాట్ల వద్ద అదనపు బందోబస్తుతో పాటు అవసరమైన చోట బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయనున్నట్లు చెప్పారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనే భక్తులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.అత్యుత్సాహంతో ప్రమాదకర విన్యాసాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పిల్లలు, ఈత రాని వారు నీటిలోకి దిగకుండా తల్లిదండ్రులు, నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి వివాదాలు, గొడవలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఇతరులను రెచ్చగొట్టే విధంగా నినాదాలు, వ్యాఖ్యలు చేయకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కోరారు. నిమజ్జనం అనంతరం రహదారులపై చెత్త, వ్యర్థాలు వేయకుండా పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని కోరారు. భక్తి మనసులో.. బాధ్యత మన చేతుల్లో.. సమిష్టి సహకారంతో సురక్షితమైన గణేష్ నిమజ్జనం జరుపుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ గణేష్ నిమజ్జన కార్యక్రమాలకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.



## గడువులోపు హియరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓటరు జాబితా హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం తిర్యాణి మండలం రొంపల్లి గ్రామంలో కొనసాగుతున్న హియరింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వారు సమర్పిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం రొంపల్లి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన, కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. తర్వాత రొంపల్లి, మెస్రంగూడ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు రొంపల్లి, గిన్నెధరి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికతో పాటు మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా ఆసుపత్రులకు గైర్హాజరు కావద్దని ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.

## వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



**మంచిర్యాల,ఫ్లాష్ ఇండియా :** మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల దొంగల ముఠాను పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.50 వేల నగదు, రెండు బైకులు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తాండూర్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో సీఐ దేవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు.ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. గత కొంతకాలంగా బెల్లంపల్లి, తాండూర్, భీమిని, నెన్నెల, తాళ్ల గురజాల, తిర్యాణి, రెబ్బెన మండలాల్లో నిందితులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, కిరాణా దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేయడంతో పాటు వ్యవసాయ పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లను కూడా అపహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.50 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిలో కత్తెర్లకు చెందిన దూల రాజేశం, మీసాల బిక్షపతి, దూల నవీన్, బట్వాన్‌పల్లికి చెందిన ఊగం రాజేష్, బోయపల్లికి చెందిన బండి నీలేష్, రోల్లపాడుకు చెందిన రెబ్బెన శ్రీకాంత్ ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్ క్యాష్ రివార్డుతో అభినందించారు. ఈ సమావేశంలో భీమిని, తాండూర్, బెల్లంపల్లి, నెన్నెల, తిర్యాణి ఎస్సైలు పాల్గొన్నారు.

## రిమ్స్ సంఘటనను సుమోటోగా తీసుకున్న హెచ్ఆర్సీ..




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(రిమ్స్)లోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ 'దిశ'తో పాటు వివిధ దినపత్రికల్లో వెలువడిన కథనాల ఆధారంగా ఈ ఘటనను సుమోటోగా స్వీకరించారు. ఈ సంఘటన పై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్టోబర్ 27వ తేదీలోగా నివేదిక అందజేయాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య , కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు .రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులోకి ఏసీ యూనిట్‌లో సంభవించిన ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి, దట్టమైన పొగ వ్యాపించి తీవ్ర అస్వస్థతకు గురై ముగ్గురు నవజాత శిశువులు చనిపోవడం అత్యంత విషాదకరం అన్నారు. ఆసుపత్రిలోని ఏసీ యూనిట్లు, విద్యుత్ వైరింగ్ నిర్వహణ, ఫైర్ అలారాలు, అగ్నిమాపక పరికరాల పనితీరు, అత్యవసర సమయాల్లో ఖాళీ చేసే ఏర్పాట్లు, అగ్ని భద్రతా ముందస్తు జాగ్రత్తలలో తీవ్ర లోపాలు ఉన్నట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయని , శిశువుల రక్షణకు తీసుకున్న తక్షణ చర్యలు, పసిపిల్లల ప్రాణాలు పోవడానికి దారి తీసిన నిజమైన కారణాలను నివేదికలో పొందుపర్చాలని ఆయన జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు.




# 28 ఏళ్ల నిరీక్షణకు తెర..

భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఆసియా క్రీడల్లో ఎట్టకేలకు పతకం సాధించారు. ఐచి-నాగోయా ఆసియా క్రీడలు 2026లో మహిళల 49 కేజీల విభాగంలో చాను రజత పతకం గెలుచుకున్నారు. దీంతో ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు 28 ఏళ్ల తర్వాత పతకం దక్కింది. చాను మొత్తం 198 కేజీలు లిఫ్ట్ చేశారు. స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో మొత్తం ఏడుగురు క్రీడాకారిణులు పోటీ పడ్డారు.

**రజతంతో చరిత్ర సృష్టించిన చాను**

ఆసియా క్రీడల్లో ఇంతకుముందు చాను పతకం సాధించలేదు. 2014 ఇంచియాన్ క్రీడల్లో ఆమె 9వ స్థానంలో నిలవగా, 2018 జకార్తా క్రీడలకు గాయం కారణంగా దూరమయ్యారు. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 49 కేజీల విభాగంలో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. 2026 నాగోయా క్రీడల్లో రజతం సాధించడం ద్వారా ఆమె కెరీర్‌లో మిగిలి ఉన్న ముఖ్యమైన పతకాలలో ఆసియా క్రీడల పతకం కూడా చేరింది.

**198 కేజీల లిఫ్ట్‌తో రెండో స్థానం**

మహిళల 49 కేజీల విభాగంలో చాను స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తారు. దీంతో ఆమె మొత్తం స్కోరు 198 కేజీలకు చేరింది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్-గమ్ స్వర్ణ పతకం సాధించగా, ఇండోనేషియాకు చెందిన లులుక్ దియానా త్రి విజాయానా కాంస్య పతకం గెలుచుకున్నారు.

**28 ఏళ్ల తర్వాత భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు పతకం**

చాను రజతంతో ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్‌కు సుదీర్ఘ విరామం ముగిసింది. అంతకుముందు భారతదేశం తరఫున కరణం మల్లేశ్వరి 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. 2026 నాగోయాలో చాను పతకంతో భారత్‌కు వెయిట్‌లిఫ్టింగ్‌లో మరో ఆసియా క్రీడల పతకం దక్కింది.

**ఒలింపిక్ రజతం నుంచి ఆసియా క్రీడల పతకం వరకు**

మీరాబాయి చాను కెరీర్‌లో ఎన్నో కీలక విజయాలు ఉన్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో మహిళల 49 కేజీల విభాగంలో ఆమె రజత పతకం సాధించారు. 2017 ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచారు. కామన్వెల్త్ గేమ్స్‌లో కూడా ఆమె పలు స్వర్ణ పతకాలు సాధించారు. అయితే ఆసియా క్రీడల పతకం మాత్రం ఆమె ఖాతాలో ఇంతవరకు లేదు. నాగోయాలో సాధించిన రజతంతో ఆ లోటు కూడా తీరింది.

**గాయాలు, ఎదురుదెబ్బల తర్వాత అద్భుత పునరాగమనం**

చాను కెరీర్‌లో గాయాలు, నిరాశలు కూడా ఉన్నాయి. 2016 రియో ఒలింపిక్స్‌లో ఆమెకు చెల్లుబాటు అయ్యే లిఫ్ట్ నమోదు కాలేదు. ఆ తర్వాత టోక్యోలో రజతం సాధించి తిరిగి తన సత్తా చాటారు. హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో కూడా గాయం ఆమె ప్రదర్శనను ప్రభావితం చేసింది. అయినప్పటికీ 2026లో తిరిగి బరిలోకి దిగి ఆసియా క్రీడల రజత పతకాన్ని సాధించారు. మీరాబాయి చాను సాధించిన ఈ పతకం భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

# సచిన్ టెండూల్కర్ రేర్ రికార్డు బ్రేక్!

ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ మరో అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 23 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో డర్హామ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ఈ అరుదైన ఫీట్ అందుకున్నాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 23 వేల రన్స్ చేసిన బ్యాటర్ల జాబితాలో రూట్ రెండో స్థానానికి చేరుకున్నాడు. జో రూట్ 521 ఇన్నింగ్స్‌లలో 23 వేల అంతర్జాతీయ పరుగులు పూర్తి చేశాడు. సచిన్ టెండూల్కర్ ఈ ఘనతను 522 ఇన్నింగ్స్‌లలో సాధించాడు. ఈ జాబితాలో భారత స్టార్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ కేవలం 490 ఇన్నింగ్స్‌లలోనే 23 వేల అంతర్జాతీయ పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. కోహ్లీ తర్వాత అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన బ్యాటర్‌గా రూట్ నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 23 వేల పరుగులు సాధించిన ఎనిమిదో బ్యాటర్‌గా రూట్ నిలిచాడు. అంతేకాకుండా ఈ ఘనత సాధించిన తొలి ఇంగ్లండ్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. జో రూట్ కంటే ముందు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రాహుల్ ద్రవిడ్, కుమార సంగక్కర, మహేల జయవర్ధనే, రికీ పాంటింగ్, జాక్వెస్ కలిస్ 23 వేల అంతర్జాతీయ పరుగులు చేశారు. రూట్ ఇప్పటికే టెస్టు క్రికెట్‌లో టెండూల్కర్‌కు సంబంధించిన పలు రికార్డులను అధిగమించాడు. ఇటీవల టెస్టు క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు సాధించిన ఆటగాడిగా సచిన్ రికార్డును బ్రేక్ చేశాడు. అయితే క్రికెట్ అభిమానుల దృష్టి ప్రస్తుతం మరో కీలక రికార్డుపైనే ఉంది. టెస్టు క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా ఉన్న సచిన్ రికార్డును కూడా రూట్ అధిగమిస్తాడా? అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం సచిన్ 15,921 టెస్టు పరుగులతో అగ్రస్థానంలో ఉండగా.. రూట్ 14,278 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి మధ్య 1,643 పరుగుల తేడా ఉంది. ఈ ఏడాది డిసెంబర్‌లో 36 ఏళ్ల వయసులోకి అడుగుపెట్టనున్న జో రూట్.. ఇప్పటికీ పరుగుల వరద పారిస్తున్నాడు. టెస్టుల్లో సచిన్ 200 మ్యాచ్‌లు ఆడగా.. రూట్ ప్రస్తుతం ఆ రికార్డుకు 31 టెస్టుల దూరంలో ఉన్నాడు. టెస్టు క్రికెట్‌లో



రూట్ అత్యుత్తమ బ్యాటర్‌గా గుర్తింపు పొందినప్పటికీ.. వన్డేల్లో అతడి ప్రదర్శన కూడా అసాధారణంగానే ఉంది. వాస్తవానికి రూట్ ప్రస్తుతం టెస్టుల కంటే వన్డేల్లో మెరుగైన బ్యాటింగ్ సగటును కలిగి ఉన్నాడు. శ్రీలంకతో తొలి వన్డేకు ముందు రూట్ 7,826 వన్డే పరుగులు సాధించాడు. 51కిపైగా సగటుతో పాటు 20 సెంచరీలు అతడి ఖాతాలో ఉన్నాయి. వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రూట్ ఇప్పటికే రికార్డు సృష్టించాడు.

# ఆసియా క్రీడల్లో మను భాకర్‌కు నిరాశ..




ఒలింపిక్స్ లో డబుల్ పతకాలతో మెరిసిన స్టార్ షూటర్ మను భాకర్ కు ఆసియా క్రీడలు 2026 లో తీవ్ర నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగం ఫైనల్‌లో బరిలోకి దిగిన ఆమె ఐదో స్థానంతో సరిపెట్టుకుని తృటిలో పతకాన్ని చేజార్చుకుంది. బుధవారం ఉదయం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో 579-20ఇ స్కోరుతో మూడో స్థానంలో నిలిచి ఘనంగా ఫైనల్‌కు అర్హత సాధించినప్పటికీ, మెడల్ రౌండ్‌లో ఆ జోరును కొనసాగించలేకపోయింది. తీవ్ర ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో 18 షాట్ల అనంతరం 181.1 పాయింట్లు మాత్రమే నమోదు చేసిన మను భాకర్.. 18వ షాట్‌లో 9.6 స్కోరు చేయడంతో ఎలిమినేట్ అయి పోడియంకు దూరమైంది. ఈ ఈవెంట్‌లో దక్షిణ కొరియాకు చెందిన చూ గేయున్ 246.3 పాయింట్లతో ఆసియా రికార్డు నమోదు చేస్తూ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, చైనా షూటర్లు షెన్ యియావో (241.3) రజతం, జియాంగ్ రాన్క్సిన్ (221.6) కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. వ్యక్తిగత విభాగంలోనే కాకుండా అంతకుముందు జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలోనూ మను భాకర్, ఇషా సింగ్, సురుచి సింగ్‌లతో కూడిన భారత జట్టు కేవలం రెండు ఇన్నర్-10 షాట్ల స్వల్ప తేడాతో నాలుగో స్థానానికి పరిమితమై పతకాన్ని కోల్పోయింది. అయితే ఈ నిరాశను పక్కనపెట్టి మను భాకర్, ఇషా సింగ్ తదుపరి జరగనున్న 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లపై దృష్టి సారించనున్నారు.

# బిజినెస్




## సెబీతో అదానీ గ్రూప్ సెటిల్‌మెంట్

అదానీ గ్రూపునకు చెందిన ఐదు కంపెనీలు తమ వ్యాపార లావాదేవీల వివరాల వెల్లడిలో జరిగిన తప్పులకు సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ'తో వివాదాన్ని పరిష్కరించుకున్నాయి. సాధారణంగా ఒకే గ్రూప్‌నకు చెందిన రెండు వేర్వేరు కంపెనీలు తమలో తాము జరిపే ఆర్థిక లావాదేవీల (రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్) వివరాలను పెట్టుబడిదారులకు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. అదానీ గ్రూప్ 2012-13 నాటి కొన్ని లావాదేవీల సమాచారాన్ని సరిగ్గా వెల్లడించలేదని, అలాగే ఆడిట్ నివేదికలపై సంతకాలు చేసిన సిఏ సంస్థల అనుమతుల్లో లోపాలు ఉన్నాయని సెబీ నోటీసులు ఇచ్చింది. ఈ పాత కేసుల విచారణను పూర్తిగా ముగించేందుకు అదానీ గ్రూప్ కంపెనీలు మొత్తం రూ. 1.51 కోట్ల రూపాయలను సెటిల్‌మెంట్ ఫీజుగా చెల్లించాయి. ఈ ఒప్పందంలో భాగంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 76.05 లక్షలు, అదానీ గ్రీన్ ఎనర్జీ రూ. 45.50 లక్షలు చెల్లించగా.. మిగిలిన మూడు కంపెనీలు దాదాపు రూ. 10 లక్షల చొప్పున చెల్లించాయి. కంపెనీలు ఈ నిధులను జమ చేయడంతో అదానీ గ్రూప్‌పై ఉన్న విచారణ ప్రక్రియను ముగిస్తున్నట్లు సెబీ ప్రకటించింది. గతంలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణల విషయంలో కూడా సెబీ ఇప్పటికే అదానీ గ్రూప్‌కు క్లీన్ చిట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ సెటిల్‌మెంట్ ఫీజు చెల్లింపుతో అదానీ కంపెనీలపై ఉన్న అన్ని పాత వివాదాలు పూర్తిగా తొలగిపోయినట్లయింది.



## వడ్డీపై ప్రభావం ఎంత..?

ఇవాళ్టి పొదుపే.. రేపు మీకు తోడుగా ఉంటుంది.. మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటుంది.. దాని కోసం డబ్బును వివిధ రూపాల్లో పెట్టుబడిగా పెడుతుంటారు.. చాలా మంది రిస్క్ ఫ్యాక్టర్ లేని ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెడుతుంటారు.. అయితే, ఎఫ్‌డీలకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చిన కొత్త నిబంధనలు 2026 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు ప్రధానంగా బల్క్ డిపాజిట్లకు సంబంధించినవి. ప్రస్తుతం షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లో రూ.3 కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తాన్ని బల్క్ డిపాజిట్‌గా పరిగణిస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం బల్క్ డిపాజిట్లపై బ్యాంకులు తమ అవసరాలు, లిక్విడిటీ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వడ్డీ రేట్లను నిర్ణయించుకునే వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా లిక్విడిటీ కవరేజ్ రేషియో ఫ్రేమ్‌వర్క్, అన్‌సెక్యూర్డ్ బల్క్ డిపాజిట్లకు వర్తించే రన్‌ఆఫ్ రేట్లను పరిగణనలోకి తీసుకుని వడ్డీ రేట్లను నిర్ణయించే అవకాశం ఉంటుంది. మరో ముఖ్యమైన మార్పు వడ్డీ రేట్ల పారదర్శకతకు సంబంధించినది. బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై, ముఖ్యంగా బల్క్ డిపాజిట్లకు వర్తించే వడ్డీ రేట్లను తమ వెబ్‌సైట్లలో స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. బల్క్ డిపాజిట్లకు సంబంధించిన రేట్లను ప్రతి పనిదినం ఉదయం నిర్ణీత సమయానికి అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అదే తేదీన, ఒకే మొత్తానికి చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంకు శాఖల మధ్య వివక్ష లేకుండా ఒకే రకమైన వడ్డీ రేట్లు వర్తించేలా నిబంధనలు రూపొందించారు. అంటే ఒకే రకమైన డిపాజిట్‌ను ఒకే తేదీన స్వీకరించినప్పుడు శాఖల ఆధారంగా వేర్వేరు వడ్డీ రేట్లు ఉండకూడదు. అయితే ఈ మార్పులు ప్రధానంగా రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలోని బల్క్ డిపాజిట్లకు సంబంధించినవి కావడంతో సాధారణంగా చిన్న మొత్తాలతో ఎఫ్‌డీలు చేసే రిటైల్ పెట్టుబడిదారులపై ప్రత్యక్ష ప్రభావం పరిమితంగానే ఉండే అవకాశం ఉంది. అదే, సమయంలో వడ్డీ రేట్ల వివరాలను బ్యాంకులు మరింత పారదర్శకంగా వెల్లడించాల్సి రావడం ఖాతాదారులకు ఉపయోగపడనుంది. కాగా, ఎఫ్‌డీలు స్థిరమైన రాబడి కోసం ఎంచుకునే ప్రముఖ పెట్టుబడి సాధనాల్లో ఒకటి. అయితే అన్ని బ్యాంకులు ఒకే వడ్డీ రేటును అందించవు. డిపాజిట్ మొత్తం, కాలపరిమితి, బ్యాంకు నిబంధనలు వంటి అంశాల ఆధారంగా రేట్లు మారవచ్చు. సీనియర్ సిటిజన్లకు కొన్ని బ్యాంకులు సాధారణ ఖాతాదారుల కంటే అదనపు వడ్డీని అందిస్తున్నాయి. కాబట్టి ఎఫ్‌డీ చేయడానికి ముందు సంబంధిత బ్యాంకు తాజా వడ్డీ రేట్లు, కాలపరిమితి, ముందస్తు ఉపసంహరణ నిబంధనలను పరిశీలించడం ఎంతైనా అవసరం..

## బంగారం ధరలు పెరిగాయి..



గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు బుధవారం యూటర్న్ తీసుకున్నాయి . పెరుగుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,54,200గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.870 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,41,350గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.800 మేర పెరిగింది.

## పెట్రోల్, డీజిల్ ధరలు ఎంతంటే?




పెట్రోల్, డీజిల్ ధరలు వాహనదారులకు ఊరటనిచ్చేలా స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు, రూపాయి మారకం విలువ తదితర అంశాల ఆధారంగా ఇంధన ధరల్లో మార్పులు చోటుచేసుకుంటుండగా.. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పు కనిపించలేదు.

**హైదరాబాద్‌లో ఇలా..**

హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.116.15గా ఉండగా, డీజిల్ ధర రూ.104.23గా నమోదైంది. రోజువారీ ధరల సమీక్షలో భాగంగా ప్రస్తుతం ఈ ధరలు కొనసాగుతున్నాయి.

**ఏపీలోనూ స్వల్ప తేడాలు**

ఆంధ్రప్రదేశ్‌లో నగరం, జిల్లాను బట్టి పెట్రోల్, డీజిల్ ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉంటాయి. విజయవాడలో డీజిల్ ధర రూ.104.96గా ఉండగా, విశాఖపట్నంలో రూ.104.11గా నమోదైంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు తదితర కారణాలతో ప్రాంతాల వారీగా ధరల్లో తేడాలు ఉంటాయి.




# బ్రేక్ ఈవెన్ టార్గెట్ ఎంతంటే?

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదేలా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ చిత్రం మరికొన్ని గంటల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధంగా ఉంది. ప్రత్యేకించి ట్రైలర్‌తో సంబంధం లేకుండానే అడ్వాన్స్ బుకింగ్స్ పరంగా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది.ముఖ్యంగా నైజాం ఏరియాలో అడ్వాన్స్ బుకింగ్స్ సంచలనం రేపుతున్నాయి. ఇప్పటికే వరల్డ్ వైడ్ అడ్వాన్స్ బుకింగ్స్ రూ. 40 కోట్ల మార్కును దాటేశాయి. నాన్-థియేట్రికల్ బిజినెస్ విషయానికొస్తే, ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులు రూ. 65 కోట్ల భారీ ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ బిజినెస్ నాని కెరీర్‌లోనే అత్యధికంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులు రూ. 75 కోట్లకు పైగా అమ్ముడవగా, ప్రపంచవ్యాప్తంగా మొత్తం థియేట్రికల్ బిజినెస్ సుమారు రూ. 100 కోట్ల మేర జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద క్లీన్ హిట్ కావాలంటే ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల నెట్ లేదా రూ. 200 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న క్రేజ్ ని బట్టి చూస్తే డే 1 రూ. 50 కోట్లు గ్రాస్ మార్క్ టచ్ అయ్యే సుచనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే నాని కెరీర్ ఇదే హయ్యెస్ట్ వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డ్ క్రియేట్ చేస్తుంది. మరి ప్యారడైజ్ ఎలాంటి సంచలనాలు నమోదు చేస్తుందో లెట్స్ వెయిట్ అండ్ వాచ్.




## పెళ్లి చేసుకోకుండానే తల్లి...

వివాహ వ్యవస్థకు వ్యతిరేకం కాదని స్పష్టం చేసింది. తనకు తోడుగా ఉండే భాగస్వామి కావాలని కోరుకుంటానని చెప్పింది. అయితే ఎప్పుడూ ఒకే బాక్స్‌లో ఇమిడిపోయే మనిషిని కానని, తన జీవితాన్ని తన ఇష్టప్రకారమే జీవిస్తానని తెలిపింది. కొన్ని విషయాల్లో తాను సంప్రదాయబద్ధంగా ఉంటానని, మరికొన్నింటిలో పాత పద్ధతులకే కట్టుబడి ఉంటానని వెల్లడించింది. అయితే ఏదీ తనపై ఎవరూ బలవంతం చేయకపోవడం వల్లే ఆ పద్ధతులు పాటిస్తున్నానని క్లారిటీ ఇచ్చింది.పెళ్లిళ్లలో జరిగే ఆర్భాటాలపై సెన్సేషనల్ కామెంట్స్ చేస్తూ.. పెళ్లి పత్రాలు, కోట్ల రూపాయల ఖర్చులు, షోఆఫ్ చూస్తే "ఇదంతా అసలు ఎవరికోసం చేస్తున్నాం?" అనిపిస్తుందని మనసులో మాట బయటపెట్టింది. లీగల్ పేపర్ల బంధం కంటే, ప్రతిరోజూ ఇద్దరం ఒకరినొకరం మనస్ఫూర్తిగా ఎంచుకోవడమే నిజమైన ప్రేమ అని తాను నమ్ముతానని చెప్పింది. భారీగా ఖర్చు పెట్టేవారితో తనకేమీ సమస్య లేదని, కానీ ఆ డబ్బును ఏదైనా సేవా కార్యక్రమాలకు, చారిటీకి ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. గతంలో ఒకసారి తాను పెళ్లి పీటల వరకు వెళ్లొచ్చినప్పటికీ, అప్పుడు కూడా తనకు ఎలాంటి భయం కలగలేదని గుర్తుచేసుకుంది. అలాగా తల్లి కావాలనే కోరికను బయటపెడుతూ.. తల్లిగా మారేందుకు పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదని.. ప్రస్తుతం ఎన్నో మార్గాలు ఉన్నాయని చెప్పింది. పిల్లలను దత్తత తీసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలాగే తన జీవన విధానంలో భాగంగా సహజంగా కూడా అమ్మ కావాలని ఉందని చెప్పుకొచ్చింది.

# తన షూటింగ్ పార్ట్ పూర్తి

సూపర్ స్టార్ మహేశ్ బాబు మరియు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళిల కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-వరల్డ్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'. భారతీయ సినీ చరిత్రలోనే సరికొత్త రికార్డులను తిరగరాసేందుకు సిద్ధమవుతున్న ఈ గ్లోబ్-ట్రాటింగ్ ఎపిక్ డ్రామా షూటింగ్ వేగంగా తుదిదశకు చేరుకుంది. ఈ గ్రాండ్ విజువల్ వండర్‌లో తన పాత్రకు సంబంధించిన ప్రధానమైన టాకీ మరియు యాక్షన్ షూటింగ్ పార్ట్‌ను మహేశ్ బాబు విజయవంతంగా పూర్తి చేశారు.సెప్టెంబర్ 22 నాటితో తన షూటింగ్ షెడ్యూల్స్ ముగియడంతో సూపర్ స్టార్ కు యూనిట్ 'ప్యాకప్' చెప్పేసింది. సో ఇక నుంచి మహేశ్ బాబు ఫుల్ ఫ్రీ అయిపోయినట్టే. అలాగే మిగతా సినిమా షూట్ అంతా కూడా ఈ అక్టోబర్ మొదటి వారంలో ఫినిష్ చేసేందుకు దర్శక ధీరుడు రాజమౌళి పక్కా ప్లానింగ్ తో షూట్ చేస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి అంతర్జాతీయ స్థాయి నటులు నటిస్తున్న ఈ బిగ్గెస్ట్ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌లో మహేశ్ సరసన నటన అంచనాలను మించి ఉంటుందని టాక్. రాముడిగా మహేశ్ అభినయం ఫ్యాన్స్ కు బెస్ట్ ఎక్సపీరియన్స్ ఇస్తుందని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న పోస్ట్-ప్రొడక్షన్, సిజిఐ మరియు విఎఫ్ఎక్స్ పనుల అనంతరం ఈ విజువల్ వండర్ ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించడానికి వచ్చే ఏడాది 7న రిలీజ్ కు సిద్ధమవుతోంది.



# 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా..



సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. అయితే మొదట ఈ సినిమాను అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.కానీ, గత కొద్ది రోజులుగా ఈ మూవీ రిలీజ్ డేట్ వాయిదా పడబోతున్నట్లు సోషల్ మీడియాలో విపరీతంగా పుకార్లు షికారు చేశాయి. ఈ నేపథ్యంలో తాజాగా, ఆ రూమర్స్‌ను నిజం చేస్తూ చిత్ర నిర్మాత నాగవంశీ సినిమా వాయిదా పడిన విషయాన్ని అధికారికంగా స్పష్టం చేశారు. 'ఆదర్శ కుటుంబం' ద్వారా ప్రేక్షకులకు అందిస్తామని హామీ ఇచ్చిన వినోదం, అద్భుతమైన అనుభూతిని మరింతగా సిద్ధం చేయడానికి తమకు కొంచెం ఎక్కువ సమయం పడుతుందని ఆయన వెల్లడించారు. ఈ కారణం వల్ల అనుకున్న తేదీకి కాకుండా, ఈ సినిమా ఇప్పుడు అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుందని తెలిపారు. అలాగే ఈ సినిమా నుంచి సెప్టెంబర్ 22న విడుదల కావాల్సిన మోస్ట్ అవైటెడ్ 'నారాయణమ్మ' సాంగ్ వాయిదా పడినట్లు తెలిపారు. ఈ స్పెషల్ సాంగ్‌ను వచ్చే వారాంతంలో విడుదల చేయనున్నట్లు నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్నఅభిమానులు షాక్‌కు గురవుతున్నారు.



# బాలకృష్ణ వాయిస్ ఓవర్‌తో...

తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేసారు మేకర్స్. ఈ చిత్రంలో కథలోని కీలక సన్నివేశాలకు, నేరేషన్‌కు బాలకృష్ణ తన వాయిస్ ఓవర్ అందించారు. బాలయ్య చెప్పిన వాయిస్ ఓవర్ కథనానికి కొత్త ఊపును తీసుకురావడమే కాకుండా, సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. డబ్బులు, ట్రబుల్స్ తో ట్రావెల్ అయ్యే హీరో లైఫ్ లోకి వచ్చిన ఓ పాప వచ్చిన తర్వాత అతని లైఫ్ లో ఎలాంటి మ్యాజిక్ జరిగిందనే కాన్సెప్ట్ తో వస్తోంది Dont Trouble the Trouble ప్రొడక్షన్స్ చాలా రిచ్ గా ఉన్నాయి. ఈ విలక్షణ చిత్రాన్ని శశాంక్ యేలేటి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనిలతో కలిసి ఎస్.ఎస్. కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాజమౌళి మరియు కార్తికేయల కోసమే బాలకృష్ణ ఈ ప్రాజెక్ట్‌కు వాయిస్ ఓవర్ ఇవ్వడానికి అంగీకరించినట్లు సమాచారం. ఆకట్టుకునే కథాంశంతో వస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఉన్నత స్థాయికి ఎదగడమే నిజమైన విజయం

టాలీవుడ్‌లో వరుస పరాజయాలతో కాస్త వెనుకబడిన యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్, తన కెరీర్‌ను మళ్లీ గాడిలో పెట్టేందుకు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. గడిచిన నాలుగైదేళ్లలో పవన్ కళ్యాణ్ సరసన భారీ బడ్జెట్ చిత్రం 'హరిహర వీరమల్లు', పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'రాజాసాబ్' వంటి అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయాయి. స్టార్ హీరోల సరసన పెద్ద సినిమాలు చేసినా సక్సెస్ రాకపోవడంతో ఆమె కెరీర్ ఊపందుకోలేదు. అయినప్పటికీ ఏ మాత్రం కుంగిపోకుండా, రూట్ మార్చి ఇప్పుడు ఓ వైవిధ్యమైన లేడీ ఓరియంటెడ్ సినిమాతో ఆడియన్స్‌ను పలకరించేందుకు రెడీ అవుతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి తన మనసులోని మాటలను బయటపెట్టారు. సక్సెస్ అంటే కేవలం లెక్కలేనన్ని సినిమాలు చేయడం కాదని, తనలోని ప్రతిభను నిరూపించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగడమే నిజమైన విజయమని తేల్చిచెప్పింది.సౌత్ ఇండస్ట్రీలో తనకు సరైన గుర్తింపునిచ్చే పవర్‌ఫుల్ రోల్స్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నానని, తాను చేరుకోవాల్సిన లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తన నటనను మరింత మెరుగుపరుచుకోవడానికి ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేస్తున్నట్లు నిధి తెలిపింది. ముఖ్యంగా తమిళ పరిశ్రమ తన టాలెంట్‌ను నిరూపించుకోవడానికి అత్యంత సరైన వేదిక అని చెప్పింది. అందుకే ప్రస్తుతం తన పూర్తి దృష్టిని తమిళ సినిమాలపైనే పెట్టినట్లు వెల్లడించింది. ప్రేక్షకుల గుండెల్లో చిరకాలం నిలిచిపోయే మంచి పాత్రలు చేయాలన్నదే తన అసలు కోరిక అని మనసులో మాట బయటపెట్టింది. రాబోయే రోజుల్లో వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను సర్ప్రైజ్ చేస్తానని చెప్పుకొచ్చింది.






# శర్వానంద్ రెమ్యునరేషన్‌కు రెక్కలొచ్చాయట

సినిమా హిట్ అండ్ ఫ్లాప్స్.. హీరోల మూవీ బడ్జెట్స్, రెమ్యునరేషన్‌పై ఎఫెక్ట్ చూపుతుంటాయి. వరుస ఫ్లాప్స్ వచ్చే సరికి 'ఇరుముడి'కి రెమ్యునరేషన్ తగ్గించుకుని.. నైజాం రైట్స్ తీసుకున్నాడు రవితేజ. సినిమా కమర్షియల్‌గా సక్సెస్ అయ్యింది దాంతో మాస్ మహారాజ్ భారీ లాభాలు అందుకున్నాడు. కేవలం నైజాంలోనే ఈ సినిమా రూ. 50 కోట్లు షేర్ రాబట్టింది. దాంతో నెక్ట్స్ మూవీకే మళ్లీ అమౌంట్ పెంచేశాడట రవితేజ. ఏకంగా రూ. 40 కోట్లు అడుగుతున్నారనేది ఇప్పుడు వినిపిస్తున్న గాసిప్. ఇప్పుడు శర్వానంద్ కూడా ఈ ఫార్ములానే ఫాలో అవుతున్నాడట.శర్వానంద్ ప్రజెంట్ రూ. 10 నుండి రూ. 12 కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటున్నాడు. 'నారీ నారీ నడుమ మురారి'హిట్ కొట్టడం, 'బైకర్'కి విమర్శకుల ప్రశంసలు దక్కడంతో రెమ్యునరేషన్ పెంచాలనే ఆలోచన చేస్తున్నాడట. భోగితో పాన్ ఇండియా లీగ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం కూడా శర్వానంద్ రెమ్యునరేషన్‌కు రెక్కలొచ్చాయని టాక్. ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి', శ్రీను వైట్ల దర్శకత్వంలో 'జార్జ్ క్రిష్' మూవీ చేస్తున్నాడు శర్వానంద్. వీటి షూటింగ్ పూర్తి కావొస్తుండటంతో మరో ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. అభిషేక్ నామా దర్శకత్వంలో ఓ పీరియాడిక్ మూవీ చేయబోతున్నాడట శర్వానంద్. ఈ సినిమా కోసం రూ. 20 కోట్లు డిమాండ్ చేశాడన్నది టాలీవుడ్ టాక్. డైరెక్టర్ కూడా నో చెప్పలేదట. దాదాపు రూ. 80 కోట్ల భారీ వ్యయంతో ఈ సినిమాను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని బజ్. నెక్ట్స్ ఇయర్ ఈ ప్రాజెక్ట్ ఎనౌన్స్ చేయనున్నారట మేకర్స్.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**